

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 113 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 14-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

బాలల దినోత్సవం

బాల్యమే ఓ అందమైన ప్రపంచం!
చిరునవ్వుల పూలతోటలో
వికసించే బాల్యం,
చిట్టి చిట్టి ఆశలతో సాగే పయనం!
కలల రెక్కలతో ఆకాశాన్ని తాకాలి,
జ్ఞాన జ్యోతులతో లోకాన్ని వెలిగించాలి!
ఆటపాటలే కాదు..
చదువులోనూ రాణించాలి,
అమ్మానాన్నల ఆశలకు
అండగా నిలవాలి!
ప్రతి చిన్నారి ముఖంలో
నవ్వులు పూయాలి,
ప్రతి బిడ్డకు సమాన అవకాశాలు దక్కాలి!
బాలలే రేపటి భారత భవిష్యత్తు కావాలి,
వారి బంగారు కలలకు
ప్రపంచం బాటలు వేయాలి!
బాలల హక్కులను కాపాడుదాం..
బాల్యాన్ని ప్రేమిద్దాం..
బాలల దినోత్సవ శుభాకాంక్షలు!

అరుణ్ రెడ్డి పన్నాల.,
వికారాబాద్ జిల్లా బ్యూరో



నా ఫోన్ ట్యాప్ చేసినా ఇబ్బంది లేదు

- విచారణలో సంచలన విషయాలు: సీఎం రేవంత్
- తన ఫోన్‌లో ఏదైనా వినొచ్చన్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాం ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని వెల్లడి
- మోదీ ప్రభుత్వం గుజరాత్ కోసమే పనిచేస్తోందని ఆరోపణ
- రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారని విమర్శ
- రాహుల్ పర్యటనను బీజేపీ వ్యతిరేకించడంపై సీఎం ప్రశ్నలు





ప్రజా వాయిస్, హైదరాబాద్: తన ఫోన్ ట్యాప్ చేసినా ఎలాంటి ఇబ్బంది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తన ఫోన్‌లో ఏదైనా వినొచ్చని వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సీఎం.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ త్వరలోనే ముగుస్తుందని తెలిపారు. ఈ కేసులో పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై కీలక వ్యాఖ్యలు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై దర్యాప్తు తుది దశకు చేరుకుంటోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విచారణ పూర్తయితే కీలక అంశాలు బయటపడతాయని చెప్పారు. తన ఫోన్‌ను ట్యాప్ చేసినా భయపడాల్సిన అవసరం లేదని, తన ఫోన్‌లో ఏం విన్నా అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గుజరాత్ ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని సీఎం విమర్శించారు. తెలంగాణ సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, రామచంద్రరావు వ్యవహార శైలితో రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాహుల్ పర్యటనపై బీజేపీకి ఎందుకంత భయం?

రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తే బీజేపీ నేతలకు ఇబ్బంది ఏమిటని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయనను బీజేపీ గుడ్డిగా వ్యతిరేకించకూడదని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారనే భయం బీజేపీకి ఉందని వ్యాఖ్యానించారు. గతంలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత మధ్య సుహృద్భావ వాతావరణం ఉండేదని గుర్తుచేశారు.

గిగ్ కార్మికులతో రాహుల్ ముఖాముఖి

శనివారం హైదరాబాద్‌లో గిగ్ కార్మికులను ఉద్దేశించి రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని సీఎం తెలిపారు. భారత్ సమ్మిట్‌లో దేశం తరపున ప్రపంచానికి సందేశం ఇచ్చేందుకు రాహుల్ హైదరాబాద్‌కు వస్తున్నారని వివరించారు. ప్రధాని మోదీ వివిధ దేశాల్లో జరిగే సదస్సులకు హాజరవుతూ, పాకిస్తాన్‌కు వెళ్లి అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్‌ను కూడా కలిశారని గుర్తుచేశారు. అయితే రాహుల్ గాంధీ ఏ కార్యక్రమంలో పాల్గొన్నా మోదీ, బీజేపీ నేతలు వ్యతిరేకిస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు.



ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా

- నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ పథకం నమోదు
- ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పథకం ప్రారంభం
- ప్రతి కుటుంబంలో ఒక సంపాదనపరుడికి రూ.5 లక్షల బీమా
- ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదనపరులుంటే కుటుంబమే ఎంపిక
- ఒకరు లేదా పలువురిని నామినీలుగా చేర్చుకునే అవకాశం
- నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాల్లో దండోరా ద్వారా ప్రచారం

సీపీ పదవికి వీడ్కోలు..

- వీసీ సజ్జనార్‌కు పోలీసు శాఖ ఘన సత్కారం
- బదిలీపై వెళ్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి
- బంజారాహిల్స్ ఐసీసీసీలో ప్రత్యేక వీడ్కోలు కార్యక్రమం
- అదనపు సీపీలు, డీసీపీలు, ఏసీపీలు, సిబ్బంది హాజరు
- శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణలో సేవలకు ప్రశంసలు
- జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించిన పోలీసు అధికారులు

2 లో



హరీశ్‌రావును రాజకీయంగా తరిమికొట్టే వరకు పోరాటం ఆగదు: కవిత

- సిద్దిపేటలో తమ పార్టీ జెండా ఎగురవేస్తామని కవిత ధీమా
- కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణ
- హరీశ్ ఆస్తుల పెరుగుదలపై విచారణ జరపాలని డిమాండ్
- అవినీతి ఆధారాలను సీఎంకు అందిస్తానని ప్రకటన
- మున్సిపల్ ఎన్నికల నుంచే రాజకీయ పోరాటం ప్రారంభిస్తామని వెల్లడి



ప్రజా వాయిస్, సిద్దిపేట: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం సిద్దిపేటలో పార్టీ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజా జీవితం నుంచి హరీశ్‌రావును తరిమికొట్టే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సిద్దిపేటలో తప్పకుండా తమ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

'అవినీతిలో నాకు పైసా భాగం లేదు'

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిలో తనకు ఎలాంటి భాగస్వామ్యం లేదని కవిత పేర్కొన్నారు. తన ఆస్తులపై విచారణ జరిపించుకోవచ్చని సవాల్ విసిరారు. హరీశ్‌రావు నీళ్లు, నిధుల దొంగ మాత్రమే కాదని, బొగ్గు దొంగ కూడా అంటూ ఆరోపణలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు గాను లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు

మిగతా 2లో

ఖైరతాబాద్ ఉపఎన్నికపై మరో ట్విస్ట్

- హైకోర్టును ఆశ్రయించిన చింతల
- విజయారెడ్డి ఎన్నికల పిటిషన్‌లో తననూ చేర్చాలని చింతల విజ్ఞప్తి
- దానం నాగేందర్ ఎన్నిక చెల్లదన్న పిటిషన్‌పై కొనసాగుతున్న విచారణ
- పిటిషన్ పరిష్కారమయ్యే వరకు ఉపఎన్నిక వద్దన్న విజయారెడ్డి
- రెండో స్థానంలో ఉన్న అభ్యర్థిని ఎమ్మెల్యేగా ప్రకటించలేరన్న చింతల వాదన
- ఎమ్మెల్యే లేక అభివృద్ధి, ప్రజా సమస్యలు ప్రభావితమవుతున్నాయని ఆందోళన

2 లో



రాహుల్ రాకకు బీఆర్ఎస్ ర్యాప్ సాంగ్ కౌంటర్

- 420 హామీలపై ప్రశ్నలు
- హైదరాబాద్‌లో రేపు రెండో భారత్ సదస్సు
- రాహుల్ గాంధీ రాకకు ముందు బీఆర్ఎస్ ర్యాప్ సాంగ్ విడుదల
- ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నలు
- మహిళలకు రూ.2,500, పింఛన్ల హామీపై నిలదీత
- విద్యార్థులు, లగచర్ల, హైడ్రా, హెచ్‌సీయూ అంశాలను ప్రస్తావించిన కేటీఆర్



ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రేపు రెండో భారత్ సదస్సు నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ వినూత్న నిరసనకు దిగింది. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తూ ఓ ర్యాప్ సాంగ్‌ను విడుదల చేసింది. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'420 హామీలు ఏమయ్యాయి?'

తెలంగాణ పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో నిర్వహిస్తున్న కాంగ్రెస్ సభలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీకి తెలంగాణ ప్రజలు సమాధానాల కోసం ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ ట్వీట్ చేసింది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, మూడేళ్లు గడిచినా వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. 420 హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని పేర్కొంది. కేవలం ప్రసంగాలు చేయడానికి కాకుండా ప్రజల ప్రశ్నలకు జవాబులు చెప్పేందుకు సిద్ధమై రావాలని రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించింది.

ఆరు గ్యారంటీలపై ర్యాప్ సాంగ్

రాహుల్ గాంధీకి హైదరాబాద్‌కు

మిగతా 2లో

తండ్రి ప్రాణాలు కాపాడేందుకు అండాలు విక్రయించేందుకు సిద్ధం

- హైదరాబాద్‌లో అక్రమ ముఠా వలలో 43 మంది మహిళలు
- తండ్రి కిడ్నీ మార్పిడి కోసం రూ.3.5 లక్షల అప్పు చేసిన కోల్‌కతా కుటుంబం
- అండాలు ఇస్తే రూ.50 వేలు ఇస్తామని చెప్పడంతో అంగీకరించిన 25 ఏళ్ల యువతి
- ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేసి 43 మంది మహిళలకు విముక్తి
- క్యాటరింగ్, ఇతర ఉద్యోగాల పేరుతో మహిళలను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ముఠా
- ఎనిమిది మంది అరెస్ట్.. 23 ఐవీఎఫ్ కేంద్రాలపై పోలీసుల దర్యాప్తు

2 లో



శాంతిభద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

- హైదరాబాద్ సీపీ మహేష్ భగవత్
- సజ్జనార్ నుంచి బాధ్యతలు స్వీకరించిన మహేష్ భగవత్
- శాంతిభద్రతలు, మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యం
- తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగం
- డయల్ 112 సేవలను మరింత మెరుగుపరుస్తామని వెల్లడి
- పోలీసుల అక్రమ వసూళ్లపై క్రిమినల్ కేసులు, శాఖాపరమైన చర్యలు



ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా మహేష్ భగవత్ బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీపీ సజ్జనార్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తన ప్రాధాన్యతలను వెల్లడించిన మహేష్ భగవత్.. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. తనకు ఈ అపకాశం కల్పించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తమ ముందున్న ప్రధాన లక్ష్యాలని సీపీ పేర్కొన్నారు. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా

మిగతా 2లో

ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ జీవిత బీమా కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనుంది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19 నుంచి లబ్ధిదారుల నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రతి కుటుంబానికీ జీవిత బీమా కల్పిస్తున్న తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

ఈ పథకం కింద ప్రతి కుటుంబంలో ఒక సంపాదనపరుడికి రూ.5 లక్షల జీవిత బీమా సదుపాయం కల్పించనున్నారు. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదనపరులు ఉంటే.. వారిలో ఎవరి పేరు మీద బీమా చేయించుకోవాలనే నిర్ణయాన్ని కుటుంబ సభ్యులకే వదిలేయనున్నారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకూ ఈ పథకం వర్తిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

నామినీల ఎంపికలో వెసులుబాటు

బీమా పొందే వ్యక్తి మరణించిన సందర్భంలో పరిహారం అందుకునేందుకు ఒకరు లేదా పలువురిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అంతేకాకుండా బీమా మొత్తంలో ఏ నామినీకి ఎంత వాటా చెల్లించాలనే విషయాన్ని కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

నవంబర్ 19 నుంచి నమోదు

నవంబర్ 19న రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో ఏకకాలంలో నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాల్లో దండోరా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు.

వివరాలు చదివి వినిపించిన తర్వాతే సంతకాలు

నమోదు ప్రక్రియలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసిన అనంతరం, వాటిని వారికి పూర్తిగా చదివి వినిపించాలని స్పష్టం చేశారు. వివరాలు సరిచూసుకున్న తర్వాతే కుటుంబ సభ్యుల నుంచి సంతకాలు తీసుకోవాలని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

హరీశ్‌రావును రాజకీయంగా తరిమికొట్టే వరకు పోరాటం ఆగదు: కవిత

మొదటి పేజీ తరువాయి

అందించారని విమర్శించారు.

మల్లన్నసాగర్ పనుల్లో అక్రమాలంటూ ఆరోపణలు

మల్లన్నసాగర్ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.6 వేల కోట్ల నుంచి రూ.9 వేల కోట్లకు పెంచారని, ఎన్డీఆర్ఐ నివేదికలను పక్కనపెట్టి నాసిరకం పనులు చేశారని కవిత ఆరోపించారు. బండ్ లీకేజీని కప్పిపుచ్చుకునేందుకే ప్రస్తుతం బ్లాస్టింగ్ డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్ బావిలోకి కాలువ ఉందా లేదా అన్నదానిపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆస్తుల పెరుగుదలపై విచారణ జరపాలి

2003 నుంచి 2023 వరకు హరీశ్‌రావు ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే ఆయన ఆస్తులు ఏ స్థాయిలో పెరిగాయో తెలుస్తుందని కవిత అన్నారు. సిద్దిపేట రిజిస్ట్రేషన్ కార్యాలయం మార్పు వెనుక, వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన ఐదు ఎకరాల భూమి వ్యవహారంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రంగనాయకసాగర్ నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వకుండా, తన 14 ఎకరాలకు మాత్రం ఎకరాకు రూ.6 లక్షల చొప్పున పరిహారం తీసుకుని గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారని విమర్శించారు.

నిమ్స్, ఆస్పత్రి, బొగ్గు వ్యవహారాలపై ఆరోపణలు

వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిమ్స్ ఉద్యోగుల ఈపీఎఫ్ నిధుల నుంచి రూ.25 కోట్లు మళ్లించి రూ.100 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని కవిత ఆరోపించారు. సిద్దిపేటలో సిబ్బంది లేకుండానే వెయ్యి పడకల ఆస్పత్రిని ప్రారంభించారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలను బెదిరించి రూ.2 వేల కోట్ల పాల వ్యాపారం చేశారని, సింగరేణి బొగ్గు తరలింపులోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు.హరీశ్‌రావు ఎమ్మెల్యే కాకముందే సిద్దిపేటలో బెటర్ రింగ్‌రోడ్డు, సబ్‌స్టేషన్లు, ఇంటింటికీ నల్లా సదుపాయం ఉండేవని కవిత గుర్తుచేశారు. ఆయన హయాంలో 120 రైస్ మిల్లులు 20కి తగ్గిపోయాయని, కార్పొరేట్ సంస్థల రాకతో స్థానిక వ్యాపారులు, పద్మశాలీలు, స్వర్ణకారుల ఉపాధి దెబ్బతిన్నదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు

హరీశ్‌రావు అవినీతిపై తాను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కవిత హెచ్చరించారు. "గుంపు మేస్త్రీతో గుంటనక్క కుమ్మక్కైంది.. అందుకే హరీశ్‌రావు అవినీతిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు" అని వ్యాఖ్యానించారు. కొండపోచమ్మసాగర్ అవినీతిపై ఇంజనీర్ల నుంచి రికవరీ చేయాలని నివేదిక వచ్చినా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు.హరీశ్‌రావుకు సంబంధించిన అవినీతి ఆధారాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందిస్తానని కవిత ప్రకటించారు. ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం ఈ అంశంపై చర్యలు తీసుకుంటారో లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సాగునీటి సమస్యలపై ప్రభుత్వానికి ప్రశ్నలు

కాంగ్రెస్ పార్టీకి ఎద్దు తెలియదు, వ్యవసాయం తెలియదంటూ కవిత ఎద్దేవా చేశారు. ఏడాది క్రితమే లోయర్ మానేరు డ్యామ్ నుంచి ఎలాంటి ఖర్చు లేకుండా మల్లన్నసాగర్‌ను నింపాలని తాను సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకే ప్రస్తుతం కరువు పరిస్థితులు వచ్చాయని అన్నారు. గౌరవెల్లి నిర్వాసితులకు పరిహారం అందించలేదని విమర్శించారు. ఆర్టీసీ విలీనం కోసం ఆత్మహత్య చేసుకున్న శంకర్‌గౌడ్ ఆశయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ నెరవేర్చలేదని ఆరోపించారు.

50 కమిటీలతో ప్రజా సమస్యల అధ్యయనం

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఏడాది పాటు మేధావులతో చర్చించి, 50 కమిటీల ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకున్న అనంతరమే తెలంగాణ రక్షణ సేనను స్థాపించినట్లు కవిత వెల్లడించారు. ప్రైవేట్ రంగంలోనూ ఉచిత విద్య, వైద్యం అందించడం తమ పార్టీ లక్ష్యమని చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది అమరులయ్యారని గుర్తుచేసుకుంటూ హరీశ్‌రావుపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేటకు నిజమైన స్వాతంత్ర్యం తీసుకురావడమే తమ లక్ష్యమని, రాబోయే మున్సిపల్ ఎన్నికల నుంచే పోరాటం ప్రారంభిస్తామని ప్రకటించారు. తమ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికపై మరో ట్విస్ట్

ప్రజా వాయిస్, హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉపఎన్నిక నిర్వహణ ఆలస్యం కాకుండా చూడాలని కోరుతూ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌లో తనను కూడా ఇంప్లీడ్ చేయాలని కోరుతూ తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పరిణామంతో ఖైరతాబాద్ ఉపఎన్నికపై రాజకీయంగా మరోసారి ఆసక్తి నెలకొంది.

దానం అనర్హతతో ఖాళీ అయిన స్థానం

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడంతో పార్టీ ఫిరాయింపుల అంశం తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల నేపథ్యంలో సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు ఆయనపై అనర్హత వేటు వేసింది. అనంతరం సెప్టెంబర్ 26న ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ సచివాలయం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

విజయారెడ్డి పిటిషన్‌తో జాప్యం?

మరోవైపు దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి గతంలో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు ఉపఎన్నిక నిర్వహించవద్దని ఆమె కోరుతున్నారు. ఈ పిటిషన్ పరిష్కారమైన తర్వాతే ఉపఎన్నిక నిర్వహణపై ముందుకు వెళ్తామని ఎన్నికల సంఘం కూడా హైకోర్టుకు తెలిపినట్లు సమాచారం. దీంతో ఉపఎన్నిక నిర్వహణపై అనిశ్చితి నెలకొంది.

రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి ఎమ్మెల్యే పదవి ఎలా?

విజయారెడ్డి పిటిషన్‌లో తనను ఇంప్లీడ్ చేయాలని కోరిన చింతల రామచంద్రారెడ్డి.. ఎన్నికల ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థికి ఎమ్మెల్యే పదవి కట్టబెట్టడం సరైన విధానం కాదని అభిప్రాయపడుతున్నారు. విజేతకు వచ్చిన ఓట్లన్నీ రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికే వచ్చేవని భావించలేమని, అందువల్ల ఉపఎన్నిక నిర్వహించడమే రాజ్యాంగబద్ధమైన మార్గమని వాదిస్తున్నట్లు తెలుస్తోంది. విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కూడా హైకోర్టును కోరినట్లు సమాచారం.

ప్రజా సమస్యలు ప్రభావితం

ఖైరతాబాద్ నియోజకవర్గానికి ప్రస్తుతం ఎమ్మెల్యే లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చింతల తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధి లేకపోవడం వల్ల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం ప్రభావితమవుతున్నాయని వివరించారు. ఉపఎన్నికను అనవసరంగా ఆలస్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వాదించారు.

మూడు పార్టీల మధ్య పోరుపై ఆసక్తి

ఖైరతాబాద్ ఉపఎన్నిక జరిగితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే మూడు పార్టీలు తమ వ్యూహాలపై దృష్టి సారిస్తున్నాయి. అయితే చింతల రామచంద్రారెడ్డి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఎన్నికల సంఘం తదుపరి చర్యలు ఎలా ఉంటాయి? అన్నదానిపైనే ఉపఎన్నిక నిర్వహణపై స్పష్టత ఆధారపడి ఉంది.



సీపీ పదవికి వీడ్కోలు.. వీసీ సజ్జనార్‌కు పోలీసు శాఖ ఘన సత్కారం

ప్రజా వాయిస్, హైదరాబాద్:హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌కు పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. నగర పోలీసు విభాగంలో ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ సహచర అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు.

ఐసీసీసీలో వీడ్కోలు సభ

బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని అదనపు కమిషనర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జనార్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

సేవలను కొనియాడిన అధికారులు

ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించడంలో వీసీ సజ్జనార్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో పనిచేయడం తమకు గర్వకారణమని అన్నారు.

జ్ఞాపిక అందజేసి సత్కారం

అనంతరం పోలీసు శాఖ తరఫున వీసీ సజ్జనార్‌కు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఆత్మీయ పలకరింపులు, అభినందనల మధ్య ఆయనకు వీడ్కోలు పలికారు.

శాంతిభద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి

సుమారు 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూముల విలువ పెరుగుతున్న నేపథ్యంలో భూ వివాదాల కారణంగా దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

నేరగాళ్లపై పీడీ యాక్ట్

పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని మహేష్ భగవత్ స్పష్టం చేశారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

సాయంత్రం వేళల్లో పోలీసింగ్ బలోపేతం

సాయంత్రం వేళల్లో నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రాథమిక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీపీ తెలిపారు. పోలీసు సిబ్బంది స్టేషన్లకే పరిమితం కాకుండా సాయంత్రం వేళల్లో రోడ్లపై విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ 112 అత్యవసర సేవల స్పందన సమయాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

పోలీసులు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మహేష్ భగవత్ హెచ్చరించారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలో సిబ్బంది కొరత ఉందని, దానిని అధిగమించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

అనుభవజ్ఞులైన అధికారులతో సమిష్టి కృషి

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో అనుభవజ్ఞులైన అధికారులు ఎంతోమంది ఉన్నారని, వారందరితో కలిసి బృందంగా పనిచేస్తామని నూతన సీపీ పేర్కొన్నారు. గతంలో సీపీగా పనిచేసిన సీవీ ఆనంద్, సజ్జనార్ చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు మరిన్ని మెరుగైన పోలీసు సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని మహేష్ భగవత్ వెల్లడించారు.

రాహుల్ రాకకు బీఆర్ఎస్ ర్యాప్ సాంగ్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

స్వాగతం పలికే శైలిలో రూపొందించిన ఈ పాటలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఇతర ఎన్నికల హామీలను ప్రస్తావించారు. 100 రోజుల్లో ఆరు హామీల అమలు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.4 వేల పింఛను వంటి వాగ్దానాలపై ప్రశ్నలు లేవనెత్తారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, వాటి అమలులో జాప్యానికి కారణాలేమిటో రాహుల్ వివరించాలని బీఆర్ఎస్ కోరింది.

కేటీఆర్ మరో ట్వీట్.. పలు అంశాల ప్రస్తావన

మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని మరో ట్వీట్ చేశారు. ఉద్యోగాల కోసం డిమాండ్ చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నప్పుడు, లగచర్ల గిరిజన మహిళలపై దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పుడు రాహుల్ స్పందించలేదని విమర్శించారు. హైడ్రా కూల్చివేతలు, కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో చెట్ల నరికివేత, జింకలు, నెమళ్లతో కూడిన పర్యావరణ వ్యవస్థకు నష్టం, కేటీఆర్ పార్కు అంశాలను ప్రస్తావించారు.

రూ.100 కోట్ల ఖర్చుపై విమర్శలు

తెలంగాణ ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు మాత్రం ప్రజాధనంతో రూ.100 కోట్ల ఖర్చుతో ప్రచార కార్యక్రమం కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని విమర్శించారు. ఈ పర్యటనకు రాహుల్ గాంధీకి అంత ధైర్యం ఎలా వచ్చిందంటూ ప్రశ్నించారు. భారత్ సదస్సు నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి వేడెక్కాయి.

తండ్రి ప్రాణాలు కాపాడేందుకు అండాలు విక్రయించేందుకు సిద్ధం

ప్రజా వాయిస్, హైదరాబాద్: పేదరికం.. అప్పుల బాధ.. కుటుంబ సభ్యుల అనారోగ్యం.. ఇవే అక్రమ అండాల సేకరణ ముఠాకు పెట్టుబడిగా మారాయి. కన్నతండ్రి ప్రాణాలు కాపాడుకోవాలనే ఆశతో ఓ యువతి అండాలు విక్రయించే అక్రమ ముఠా వలలో చిక్కుకుంది. కుటుంబంపై ఉన్న అప్పుల భారం తగ్గించుకోవడానికి హైదరాబాద్‌లో అండాలు దానం చేస్తే రూ.50 వేలు ఇస్తామని చెప్పడంతో ఆమె అంగీకరించింది. అయితే దీని వెనుక ఉన్న అక్రమ దందా, ఆరోగ్యానికి ఎదురయ్యే ప్రమాదాల గురించి ఆమెకు తెలియదు. ఇలా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది మహిళలను ఈ ముఠా బారినుంచి మల్కాజిగిరి పోలీసులు రక్షించారు. ఈ ఘటనలో వెలుగుచూసిన బాధితుల కథలు హృదయాలను కలచివేస్తున్నాయి.

తండ్రి చికిత్స కోసం అడ్డదారి

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన 25 ఏళ్ల యువతి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఆమె తండ్రి కిడ్నీలు పూర్తిగా దెబ్బతినడంతో మార్పిడి శస్త్రచికిత్స అవసరమైంది. ఇందుకోసం కుటుంబం ఇప్పటికే సుమారు రూ.3.5 లక్షలు అప్పు చేసింది. తల్లి రోజువారీ కూలీ పనులు చేస్తుండగా, మరో నలుగురు తోబుట్టువులు చదువుకుంటున్నారు. వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా మారడంతో అప్పుల ఒత్తిడి పెరిగింది.ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌లో అండాలు దానం చేస్తే రూ.50 వేలు ఇస్తామని కొందరు ఆమెను సంప్రదించారు. తండ్రి చికిత్సకు డబ్బులు సమకూరుతాయనే ఆశతో ఆమె అంగీకరించింది. అయితే ఇది అక్రమ వ్యవహారమని తనకు తెలియదని, కుటుంబాన్ని కష్టాల నుంచి బయటపడేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆమె కన్నీటిపర్యంతమైంది.

ఐదు ప్రాంతాల్లో పోలీసుల దాడులు

హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ అక్రమ అండాల సేకరణ వ్యవహారం అక్టోబర్ 30న వెలుగులోకి వచ్చింది. ప్రకాశ్‌నగర్, బేగంపేట, ఎర్రగడ్డ, సరూర్‌నగర్, గోపాలపురం ప్రాంతాల్లో మల్కాజిగిరి పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి 43 మంది మహిళలను రక్షించారు. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఢిల్లీ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి పేదరికంలో ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో గుర్తించారు.కొంతమందికి అండాలు దానం చేస్తే డబ్బులు వస్తాయని చెప్పగా, మరికొందరిని



క్యాటరింగ్, ఇతర ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు బాధితులు వెల్లడించారు. హాస్టళ్లు, విల్లాల్లో వసతి కల్పించి హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాల సేకరణకు సిద్ధం చేసేవారని పోలీసులు గుర్తించారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో విషాదగాథ

ఈ ముఠా వలలో చిక్కుకున్న మహిళల పరిస్థితులు తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. ముంబైకి చెందిన 25 ఏళ్ల మహిళ భర్త ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. 75 ఏళ్ల నానమ్మ బాధ్యత కూడా ఆమెపైనే ఉంది. ఈ క్రమంలో నెల రోజుల పనికి రూ.30 వేలు ఇస్తామని చెప్పడంతో హైదరాబాద్‌కు వచ్చింది.కోల్‌కతాకు చెందిన మరో 30 ఏళ్ల మహిళకు 12 ఏళ్ల కుమార్తె ఉంది. సంతానం లేని వారికి సహాయం చేస్తే కొంత డబ్బు వస్తుందనే ఉద్దేశంతో ఈ పనికి అంగీకరించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 33 ఏళ్ల మహిళ కుటుంబం ఆర్థిక కష్టాలతో తీవ్ర నిరాశలో ఉండగా, రూ.30 వేల పని అని చెప్పడంతో ఒప్పుకున్నట్లు వెల్లడించింది. మరో 26 ఏళ్ల మహిళకు క్యాటరింగ్ ఉద్యోగం పేరుతో నెలకు రూ.40 వేలు ఇస్తామని నమ్మించి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాతే అసలు విషయం తెలిసిందని ఆమె తెలిపింది.

నకిలీ ఆధార్ కార్డులు.. పత్రాలు స్వాధీనం

మహిళలను తమ ఆధీనంలో ఉంచుకునేందుకు ముఠా సభ్యులు వారి వ్యక్తిగత పత్రాలను కూడా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వసతి కల్పించే సమయంలో ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్కులు తీసుకుని తిరిగి ఇవ్వలేదని బాధితులు చెబుతున్నారు. ఒక రిక్రూట్‌మెంట్ ఏజెంట్ వద్ద వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళల పేర్లతో ఉన్న సుమారు 100 నకిలీ ఆధార్ కార్డులను గుర్తించినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు.ఈ కేసులో అమిత్ శర్మ, నిఖత్ పర్వీన్, రేష్మా ఖాతూన్, మేఘావత్ శ్రీనివాస్, జె. ప్రదీప్, ఎన్‌కే ప్రవీణ్, విజయ్ భగవత్ రావు సాలుంకే, పంకజ్ సోనీలను పోలీసులు అరెస్టు చేశారు. అమిత్ శర్మ ఈ ముఠాకు ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నెట్‌వర్క్ దాదాపు రెండేళ్లుగా కొనసాగి ఉండవచ్చని భావిస్తున్నారు.

23 ఐవీఎఫ్ కేంద్రాలపై ఆరా

నగరంలోని 23 ఐవీఎఫ్ కేంద్రాలకు ఈ అక్రమ వ్యవహారంతో ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం–2021 ప్రకారం మానవ అండాలను విక్రయించడం, వాణిజ్య ప్రయోజనాల కోసం బదిలీ చేయడం నిషేధం. చట్టబద్ధమైన అండదానానికి 23 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు మాత్రమే అర్హులు. ఒక మహిళ జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే అండదానం చేయాలి. ఒకసారి సేకరించే అండాల సంఖ్య ఏడుకు మించకూడదు. అండదాతకు వైద్యపరమైన సమస్యలు తలెత్తితే చికిత్స అందించేందుకు 12 నెలల ఆరోగ్య బీమా కల్పించాల్సి ఉంటుంది.

రెస్క్యూ హోమ్‌లో బాధితులు

పోలీసులు రక్షించిన 43 మంది మహిళలకు హైదరాబాద్ శివార్లలోని రెస్క్యూ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. ఈ కేసులో బాధితులుగా ఉండటంతో పాటు కీలక సాక్షులుగా కూడా వారి వాంగ్మూలాలు అవసరమని అధికారులు భావిస్తున్నారు. ముఠాలోని మరికొందరు నిందితులు ఇంకా పట్టుబడాల్సి ఉండటంతో వారిని వెంటనే స్వస్థలాలకు పంపడం లేదని తెలుస్తోంది.

చేవెళ్లలో ఆర్మీ వాహనం బోల్తా

.. 14 మంది జవాన్లకు గాయాలు

- అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడిన ఆర్మీ వాహనం

- వాహనంలో ప్రయాణిస్తున్న 14 మంది సైనికులకు గాయాలు

- ఎనిమిది మంది పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు సమాచారం

- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స

ప్రజా వాయిస్, రంగారెడ్డి జిల్లా: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జవాన్లతో వెళ్తున్న ఆర్మీ వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో 14 మంది సైనికులు గాయపడ్డారు. వారిలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. అల్వాడ గేట్ సమీపంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

అదుపుతప్పి బోల్తా

పడిన వాహనం14 మంది సైనికులతో ప్రయాణిస్తున్న ఆర్మీ వాహనం చేవెళ్ల మండలం అల్వాడ గేట్ వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు వాహనంలోని జవాన్లందరూ గాయపడ్డారు. భారీ శబ్దం విన్న స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో చిక్కుకున్న సైనికులను బయటకు తీసేందుకు శ్రమించారు.

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు వెంటనే అక్కడికి చేరుకున్నాయి. 108 అంబులెన్స్‌ల ద్వారా క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మొత్తం 14 మంది గాయపడగా, వారిలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది.

క్రేన్‌తో వాహనం తొలగింపు

ప్రమాదం కారణంగా చేవెళ్ల రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగంలోకి దిగి క్రేన్ సహాయంతో బోల్తాపడిన ఆర్మీ వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వాహనం అద



భూ కబ్జా ఆరోపణలపై రాజకీయ దుమారం

- బాధిత కుటుంబానికి డాక్టర్ మెతుకు ఆనంద్ మద్దతు
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పై భూ కబ్జా యత్నం ఆరోపణలు
- 18 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శ
- కోర్టు ఆదేశాల బోర్డుకు నిప్పటించారని ఆరోపణ
- అధికార యంత్రాంగం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్

ప్రజా వాయిస్/వికారాబాద్ బ్యూరో: వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో భూ వివాదం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వివాదాస్పద స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 18 సంవత్సరాల క్రితం అజ్మత్ అనే వ్యక్తి కొనుగోలు చేసిన స్థలానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అజ్మత్ నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను పోలీసుల సమక్షంలోనే బలవంతంగా కూల్చివేశారన్నారు.అంతేకాకుండా, కోర్టు ఆదేశాల మేరకు స్థలంలోకి ప్రవేశించరాదని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుకు పెట్రోల్ పోసి నిప్పంటించారని ఆరోపించారు. పొలం నుంచి దారి ఇవ్వక పోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని మెతుకు ఆనంద్ ఆరోపించారు.బాధితుల పక్షాన న్యాయం ఉందని చెబుతున్నప్పటికీ, 74 ఏళ్ల వృద్ధుడిని ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పేద, సామాన్య ప్రజల భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ వివాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.

మంథని నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో నాణ్యత ఏది?

- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం వరకేనా ప్రజాప్రతినిధుల బాధ్యత?
- పలిమెలలో ఆరు నెలలకే దెబ్బతిన్న చెక్ డ్యాం
- ప్రారంభానికి ముందే పగుళ్లు, దెబ్బతిన్న టైల్స్ తో ఎంఈఓ కార్యాలయం
- మంథని నియోజకవర్గంలో నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు
- పనులు ప్రారంభించిన తర్వాత పర్యవేక్షణ కరువైందన్న విమర్శలు





ప్రజా వాయిస్, పలిమెల:మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో చేపడుతున్న నిర్మాణాల నాణ్యతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేయడం, ప్రారంభోత్సవాలు నిర్వహించడం వరకే ప్రజాప్రతినిధుల బాధ్యత పరిమితమవుతోందా? పనులు పూర్తయ్యే వరకు వాటి నాణ్యతను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో పలిమెల మండలంలో ఎంఈఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎంఈఓ కార్యాలయం భవనంలోనే గోడలకు పగుళ్లు, ముందు భాగంలో టైల్స్ దెబ్బతినడం నిర్మాణ నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు మండల కేంద్రంలోని అట్టావాగు ఒర్రె వద్ద ప్రజలు, రైతుల అవసరాల కోసం నిర్మించిన చెక్‌డ్యాం ఆరు నెలలకే దెబ్బతిన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు కొద్దికాలానికే దెబ్బతింటే బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించి, వాటి నాణ్యతను సమీక్షించాల్సిన వ్యవస్థపై కూడా చర్చ జరుగుతోంది. మంత్రి రాష్ట్రస్థాయి రాజకీయ, పార్టీ కార్యక్రమాలతో బిజీగా ఉండే పరిస్థితుల్లో నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మంత్రి సోదరుడు పార్టీ వ్యవహారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానిక అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. పనులు ప్రారంభించే ముందు హడావుడి కనిపిస్తున్నప్పటికీ, నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న అంశంపై నిరంతర తనిఖీలు జరుగుతున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పలిమెల లోని ఎంఈఓ కార్యాలయం, చెక్‌డ్యాం పరిస్థితులే ఇందుకు ఉదాహరణగా స్థానికులు ప్రస్తావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పలిమెలలోని నిర్మాణ పనులతో పాటు మంథని నియోజకవర్గవ్యాప్తంగా ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులపై సమగ్ర సాంకేతిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. నాణ్యతాలోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాల ఫొటోలకే పరిమితం కాకుండా, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలన్నదే ప్రజల ఆకాంక్ష.





బెల్ట్ షాపుల భరతం పడుతున్న పోలీసులు.!

- మందమర్రిలో వరుస దాడులతో నిర్వాహకుల్లో దడ..
- రాములమ్మ బెల్ట్ షాపులో మద్యం పట్టివేత
- అంగడిబజార్ ఘర్షణతో కదిలిన పోలీసు యంత్రాంగం.?
- అక్రమ మద్యం విక్రయాలపై కొరడా ఝళిపింపు

ప్రజా వాయిస్, మందమర్రి: మందమర్రి పట్టణంలో బెల్ట్ షాపుల జోరుకు పోలీసులు కళ్లెం వేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై నిఘా పెంచి వరుస దాడులతో నిర్వాహకులకు చెక్ పెడుతున్నారు. ఇటీవల రాములమ్మ బెల్ట్ షాపుపై దాడి చేసి మద్యాన్ని సీజ్ చేయడం కలకలం రేపింది.మరోవైపు అంగడిబజార్ ప్రాంతంలోని బెల్ట్ షాపులో మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటన తర్వాతే బెల్ట్ షాపులపై పోలీసుల నిఘా మరింత పెరిగిందా, అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుస దాడులతో నిర్వాహకుల్లో గుబులు మొదలైంది. అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల దూకుడు ఇలాగే కొనసాగుతుందా, బెల్ట్ షాపులకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడుతుందా, అన్నది పట్టణంలో ఆసక్తికరంగా మారింది.

పేరుకే మహిళా సర్పంచ్.. పెత్తనమంతా భర్తలదే!

- జిల్లా వ్యాప్తంగా 'షాడో' పాలనకుర్చీ ఆమెది.. అధికారం ఆయనది
- గ్రామ పంచాయతీల్లో భర్తల చలామణి రిజర్వేషన్ ఆశయానికి తూట్లు:
- మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తల పెత్తనం!



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి స్థానిక సంస్థల్లో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ఆశయం క్షేత్రస్థాయిలో నీరుగారిపోతోంది.జిల్లా వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీలలో మహిళలు సర్పంచులుగా ఎన్నికైనప్పటికీ, అధికార మంతా వారి భర్తల చేతుల్లోనే కేంద్రీకృత మైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరుకే మహిళా సర్పంచులు పదవుల్లో కొన సాగుతుండగా, తెరవెనుక 'షాడో సర్పంచులు'గా వారి భర్తలే చలామణి అవుతున్నారు.సమావేశాల్లోనూ భర్తలదే హవా గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశాలు మొదలుకుని మండల,జిల్లా స్థాయి సమీక్షల వరకు ఎక్కడ చూసినా మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలే ప్రత్యక్షమవుతున్నారు. అధికారిక కార్యక్రమాలు, శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలలో ప్రోటోకాల్ నిబంధనలను సైతం పక్కనపెట్టి భర్తలే ముందుండి వ్యవహరిస్తున్నారు. కొందరు మహిళా సర్పంచులు కేవలం చెక్కులపై సంతకాలు చేయడానికి,అధికారిక దస్త్రాలపై వేలిముద్రలు వేయడానికి మాత్రమే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మాత్రమే అధికారిక సమావేశాలకు హాజరుకావాలి.ఇతర కుటుంబ సభ్యులకు ఎటువంటి అధికారిక హోదా ఉండదు.అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు,మండల స్థాయి అధికారులు సైతం సర్పంచుల భర్తలకే ప్రాధాన్యం ఇస్తుండటం గమనార్హం.వారి ఆదేశాల మేరకే పనులు జరుగుతుండటంతో మహిళా సర్పంచుల స్వతంత్రత ప్రశ్నార్థకంగా మారింది.మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా, పురుషాధిక్యత కారణంగా మహిళలు కేవలం 'రబ్బరు స్టాంపులు'గా మారిపోతున్నారని ప్రజాసంఘాలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమస్యలపై మహిళా సర్పంచులు నేరుగా స్పందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, సమావేశాల్లో భర్తల జోక్యాన్ని కట్టడి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రూ.25 లక్షల గంజాయి స్వాధీనం.!

- బ్రేక్ డౌన్ తో గంజాయి గుట్టురట్టు
- 112 కిలోల మత్తు సరుకు పట్టివేత
- ఐదుగురి ముఠాలో ఇద్దరు అరెస్టు
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా వెలుగులోకి
- ఎస్కార్ట్ వాహనంలో ముగ్గురు పరారీ
- ఇన్నోవా కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం



ప్రజా వాయిస్,సూర్యాపేట: బ్రేక్‌డౌన్ అయిన ఇన్నోవా కారు గంజాయి అక్రమ రవాణా గుట్టును రట్టు చేసింది. సూర్యాపేట శివారులో జాతీయ రహదారి–65పై పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో పదిలేసిన కారులో 112 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.25 లక్షలుగా అంచనా వేశారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.ఈ నెల 7న స్థానికుల సమాచారంతో అనుమానాస్పదంగా నిలిపి ఉన్న ఇన్నోవా కారును తనిఖీ చేయగా 41 ప్యాకెట్ల గంజాయి బయటపడింది. అప్పటి నుంచి వాహనంపై నిఘా పెట్టిన పోలీసులు ఈ నెల 12న కారువద్దకు వచ్చిన ఆకాష్ విజయ్ దేవోకర్, ఆకాష్ దిలీప్ మోరెలను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో ఐదుగురు కలిసి ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఒడిశాలోని జగన్నాథపురి వద్ద గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కిలో రూ.2 వేల చొప్పున 112 కిలోల గంజాయిని రూ.2.24 లక్షలకు కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. మహారాష్ట్రకు తరలించే క్రమంలో ఎస్కార్ట్‌గా వచ్చిన మరో వాహనంలోని ముగ్గురు పరారయ్యారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇన్నోవా కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన టూ టౌన్ సీఐ వెంకటయ్య, ఎస్సై గోపీకిషన్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



నడిరోడ్డుపై కంకర కుప్పలు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రయాణికుల బలిపీఠం
- రోడ్డా? లేక కంకర డంపింగ్ యార్డా?
- జైపూర్ లో బాలుర వసతి గృహ నిర్మాణ పనుల పేరిట ఇష్టారాజ్యం
- రహదారిని ఆక్రమించి ఇసుక, కంకర పోయడంతో వాహనదారుల నరకయాతన
- వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరంటూ స్థానికుల ఆగ్రహం





జైపూర్ ప్రజా వాయిస్ : జైపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. నిర్మాణ సామాగ్రిని భవన ప్రాంగణంలో కాకుండా, ఏకంగా ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన తారు రోడ్డుపైనే ఇసుక, కంకర కుప్పలుగా పోయడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి

కనీసం వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందన్న కనీస సోయి కూడా లేకుండా కాంట్రాక్టర్ నడిరోడ్డుపైనే కంకరను పోయించాడు. ఈ కంకర రాళ్లు రోడ్డు అంతటా చెల్లాచెదురుగా పడి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చే బైకులు ఈ కంకరపై స్కిడ్ అయ్యి కిందపడితే, ఆ ప్రాణాలకు, ఆస్తి నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చీకటి కారణంగా ఈ కుప్పలు కనిపించక పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రభుత్వ భవన నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలు పాటించేలా పర్యవేక్షించాల్సి ఉన్నా, అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సదరు కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై ఉన్న కంకర, ఇసుక కుప్పలను వెంటనే తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని జైపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

మంథనిలో తాగునీటి వృథా.. అధికారుల నిర్లక్ష్యం

- రెండు రోజులుగా వాటర్ ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న మంచినీళ్లు
- ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



ప్రజా వాయిస్ మంథని మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, శ్రీపాద కాలనీలోని వాటర్ ట్యాంక్ నుంచి రెండు రోజులుగా మంచినీళ్లు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించాల్సిన అధికారులే, మరోవైపు ప్రభుత్వ తాగునీరు వృథాగా పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. శ్రీపాద కాలనీలో వాటర్ ట్యాంక్ నుంచి నీరు వృథాగా పోతున్న విషయాన్ని స్థానికులు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా నీరు వృథాగా పోతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడంపై అసహనం వ్యక్తమవుతోంది. ప్రజలకు నీటి పొదుపుపై సూచనలు చేయడమే కాకుండా, ప్రభుత్వ నీటి వనరులు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతో పాటు, ఫిర్యాదులను పట్టించుకోని బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రేమ వేధింపులే కారణమా?

- బీసీసీఐ అండర్ -19కు ఎంపికైన ప్రతిభావంతురాలు బలవన్మరణం
- నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి
- టీఆర్ ఎస్ వీ జిల్లా అధ్యక్షుడు దీపక్ రెడ్డి

ప్రజావాయిస్ / వికారాబాద్ బ్యూరో: వికారాబాద్ పట్టణంలోని మధు కాలనీలో బీసీసీఐ అండర్-19 క్రికెట్ క్రీడాకారిణి, ప్రతిభావంతురాలైన విద్యార్థిని నందిని (17) ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. యాలాల్ మండలం సంగయ్యపల్లి గ్రామానికి చెందిన నందిని, వికారాబాద్‌లోని అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుతో పాటు క్రికెట్‌లో శిక్షణ పొందుతోంది. ఇటీవల బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికై జిల్లాకు గర్వకారణంగా నిలిచిన ఆమె అకాల మరణం పట్ల తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం (టీఆర్ఎస్వీ) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. అనిల్ అనే యువకుడు ప్రేమ పేరుతో గత కొంతకాలంగా నందినిని వేధిస్తున్నాడని, అతనికి కృష్ణ అనే మరో విద్యార్థి సహకరిస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని తెలిపారు. వేధింపుల కారణంగానే నందిని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.నందిని మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనిల్, కృష్ణలను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులుగా తేలితే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లల పట్ల వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు.కన్నబిడ్డను కోల్పోయి న్యాయం కోసం రాస్తారోకో చేస్తున్న నందిని కుటుంబానికి తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని దీపక్ రెడ్డి హెచ్చరించారు.

బూడిద రవాణాకు రూ.6 వేల మామూళ్ల హుకుం?

- టన్నుకు రూ.75 చెల్లించి తీసుకెళ్లాల్సిన బూడిద
- ఇతర జిల్లాల, రాష్ట్రాల్లో భారీ ధరకు విక్రయం?
- ఒక్కో లోడుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు వ్యాపారం
- రోజుకు 300 వాహనాల రాకపోకలు
- తెరవెనుక ఉన్నదెవరు?- మంత్రి అనుచరులా? ఎమ్మెల్యే వర్గీయులా? స్థానికంగా చర్చ!



ప్రజా వాయిస్ పెద్దపల్లి రామగుండం ఎన్టీపీసీ బూడిద రవాణా వ్యవహారం వెనుక భారీ వ్యాపార లావాదేవీలు, వసూళ్ల ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే బూడిదను నిబంధనల ప్రకారం టన్నుకు రూ.75 చెల్లించి తీసుకెళ్లాల్సి ఉండగా, అదే బూడిదను ఇతర రాష్ట్రాలకు తరలించి ఒక్కో లోడును రూ.50 వేల నుంచి రూ.60 వేల మధ్య విక్రయిస్తున్నారనే సమాచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ప్రతి వాహనానికి రూ.6 వేల చొప్పున స్థానిక నాయకులకు చెల్లించాలనే ఒత్తిడి ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బూడిద రవాణా వ్యవహారంలో రోజుకు సుమారు 300 వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు సమాచారం. ప్రతి వాహనానికి రూ.6 వేల చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే రోజుకు రూ.18 లక్షల మేర వసూళ్లు జరిగే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉంది? ఎవరికి ఈ డబ్బులు చేరుతున్నాయి? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

రూ.75 బూడిద.. రూ.60 వేల వ్యాపారం?

ఎన్టీపీసీ నుంచి టన్నుకు రూ.75 చెల్లించి తీసుకెళ్లాల్సిన బూడిదను ఇతర రాష్ట్రాలకు తరలించి, ఒక్కో లోడును రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు విక్రయిస్తున్నారనే సమాచారం వినిపిస్తోంది. ఈ బూడిద ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరికి విక్రయిస్తున్నారు? రవాణా అనుమతులు ఎలా పొందుతున్నారు? విక్రయాల లావాదేవీలు అధికారికంగా నమోదు అవుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ఎన్టీపీసీ యాజమాన్యం సరఫరా రికార్డులు, రవాణా వివరాలు, విక్రయ లావాదేవీలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఆ నాయకులు ఎవరు? మంత్రి మనుషులా? ఎమ్మెల్యే మనుషులా?

ప్రతి వాహనానికి రూ.6 వేల చొప్పున చెల్లించాలనే ఒత్తిడి వెనుక స్థానికంగా రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు మంత్రి అనుచరులా? స్థానిక ఎమ్మెల్యే వర్గానికి చెందినవారా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారితీస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో పేర్కొంటున్న వ్యక్తుల వివరాలు, వారి ప్రమేయంపై స్వతంత్ర ధ్రువీకరణ రావాల్సి ఉంది. సంబంధిత ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. రోజుకు వందల సంఖ్యలో వాహనాలు బూడిదను తరలిస్తున్నట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో ఎన్టీపీసీ యాజమాన్యం, రవాణా శాఖ, పోలీసు శాఖ పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బూడిద సరఫరా నుంచి ఇతర రాష్ట్రాలకు తరలింపు వరకు జరుగుతున్న లావాదేవీలపై అధికారులు దృష్టి సారించారా? ఓవర్‌లోడ్ వాహనాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారా? వాహనానికి రూ.6 వేల వసూళ్ల ఆరోపణలపై విచారణ చేపట్టారా? అన్నది తేలాల్సి ఉంది.

సమగ్ర విచారణ జరిపితేనే అసలు గుట్టు

బూడిద సరఫరా రికార్డులు, టన్నుకు వసూలు చేస్తున్న ధర, ఒక్కో వాహనంలో తరలిస్తున్న పరిమాణం, ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ధర, రవాణా అనుమతులు, ఆరోపణలుగా వినిపిస్తున్న వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు, అర్హులైన పరిశ్రమలకు అందాల్సిన బూడిద వ్యాపార ప్రయోజనాలకు పక్కదారి పడుతోందా? రాజకీయ పలుకుబడి పేరుతో వసూళ్ల వ్యవస్థ నడుస్తోందా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

ప్రజావాయిస్ ఎఫెక్ట్...అక్రమ కట్టడాలకు బ్రేక్

- నలంద నగర్ లో మూడు అక్రమ భవనాలు సీజ్ , మరో భవనానికి నోటీసు జారీ
- అదనపు అంతస్తులు సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవనాలపై చర్యలు
- వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం
- ఇక మిగిలిన అక్రమ కట్టడాల సంగతేంటి.?



ప్రజావాయిస్|| రాజేంద్రనగర్: అనుమతులు రెండంతస్తులకు,నిర్మాణాలు ఐదంతస్తుల వరకు. సెట్‌బ్యాక్‌లకు చోటు లేదు, నిబంధనలకు విలువ లేదు. ఇన్నాళ్లూ కళ్లముందే సాగిన అక్రమ నిర్మాణాలపై ఎట్టకేలకు టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝళిపించారు.అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని నలంద నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు భవనాలను అధికారులు సీజ్ చేసి,మరో భవనానికి నోటీసు జారీ చేసినట్లు టౌన్ ప్లానింగ్ ఓవర్సీస్ అధికారి విశాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావాయిస్‌లో వరుసగా ప్రచురితమైన కథనాలు అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చాయి.గత నెల 29,ఈ నెల 6వ తేదీన ప్రజావాయిస్‌లో నలంద నగర్ అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. అనుమతుల ముసుగులో అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు,హైటెన్షన్ విద్యుత్ స్తంభం పక్కనే భవనం నిర్మాణం వంటి అంశాలను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజావాయిస్ పత్రిక.బిల్డర్ల దూకుడుపై ప్రశ్నలు సంధించడంతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతను కూడా గుర్తుచేశాం.దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు మూడు భవనాలను సీజ్ చేశారు.

విశాల్ రెడ్డి ఏమన్నారంటే

టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ అధికారి విశాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నలంద నగర్‌లో అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టామని తెలిపారు. అనుమతులకు మించి, ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు భవనాలను గుర్తించి సీజ్ చేసి మరో భవనానికి నోటీసు జారీ చేసినట్లు స్పష్టం చేశారు.

సీజ్ తో సరిపెడతారా.. పూర్తి స్థాయి చర్యలుంటాయా?

మూడు భవనాలను సీజ్ చేయడంతో సమస్య పరిష్కారమైనట్లేనా.? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లపై తదుపరి చర్యలేంటి.? గతంలో వ్యక్తమైన అక్రమ వసూళ్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు.? విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారుల పాత్రపై విచారణ ఉంటుందా.? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.సీజ్ చేసిన మూడు భవనాలకే చర్యలు పరిమితం కాకుండా, నలంద నగర్‌లోని అన్ని అనుమానాస్పద నిర్మాణాల అనుమతులు,ఆమోదిత ప్లాన్లు,క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతాధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజావాయిస్ కథనాలతో కదిలిన అధికారులు.ఇక అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న అసలు వ్యవహారంపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారా.? అన్నది వేచి చూడాలి.

రైతు నాయకుడికి కీలక పదవి దక్కేనా

- మిర్యాలగూడ కాంగ్రెస్ లో ఆసక్తికర చర్చ
- మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం
- పార్టీకి అంకితభావంతో సేవలు
- మాజీ మంత్రి జానారెడ్డి సహా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థాయి నేతల అండదండలు అదనపు బలం.
- మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ముదిరెడ్డి నర్సిరెడ్డి గురి



మిర్యాలగూడ, ప్రజావాయిస్: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరించనుందనే అంశం కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతోంది. ఈ పదవిని ఆశిస్తున్న వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నల్లగొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీకి చేసిన సేవలు, ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవంతో పాటు జిల్లాలోని కీలక కాంగ్రెస్ నాయకులతో ఉన్న రాజకీయ సంబంధాలు ఆయనకు అదనపు బలంగా మారుతున్నాయనే చర్చ సాగుతోంది.1992–1996 మధ్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్యూఐ అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నర్సిరెడ్డి, 1997–2002 వరకు మిర్యాలగూడలోని అప్పలమ్మ చెరువు వాటర్ యూజర్స్ అసోసియేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 2003–2009 వరకు నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, 2010–2014 వరకు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 2014 నుంచి 2024 వరకు మిర్యాలగూడ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా పదేళ్ల పాటు ప్రజాప్రతినిధిగా కొనసాగారు. ప్రస్తుతం 2020 నుంచి నల్లగొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అండదండలు.. అదనపు రాజకీయ బలం

ముదిరెడ్డి నర్సిరెడ్డి రాజకీయ ప్రస్థానానికి తోడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక కాంగ్రెస్ నేతల అండదండలు ఆయనకు అదనపు బలంగా నిలుస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు జానారెడ్డి ఆశీస్సులతో పాటు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ వంటి ముఖ్య నాయకుల మద్దతు లభిస్తే ఆయనకు రాజకీయంగా మరింత కలిసి వచ్చే అవకాశముందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ముఖ్యంగా రైతు సమస్యలపై పనిచేస్తున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఆయనకు ఉన్న అనుభవం వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యతల నిర్వహణకు ఉపయోగపడుతుందని అనుచరులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కోసం విద్యార్థి దశ నుంచి పనిచేస్తూ వివిధ హోదాల్లో సేవలందించిన నాయకుడికి తగిన గుర్తింపు కల్పించాలనే వాదన కూడా వినిపిస్తోంది.

అనుభవానికా.. రాజకీయ సమీకరణాలకా ప్రాధాన్యత

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికలో పార్టీ విధేయత, సీనియారిటీ, సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముదిరెడ్డి నర్సిరెడ్డికి అవకాశం కల్పిస్తే పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన నాయకుడికి సముచిత గుర్తింపు లభించినట్లవుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం.. పదేళ్ల కౌన్సిలర్‌గా ప్రజాసేవ.. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు.. జిల్లాలోని కీలక నేతలతో రాజకీయ అనుబంధం.. ఈ అంశాలన్నీ కలిసివస్తే మిర్యాలగూడ మార్కెట్ కమిటీ పీఠంపై ముదిరెడ్డి నర్సిరెడ్డి ఆశలు ఫలిస్తాయా.. కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది..అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

హౌసింగ్ బోర్డు చిన్న చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ

- నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే
- నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



ప్రజా వాయిస్ | మిర్యాలగూడ మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఉన్న చిన్న చెరువు అభివృద్ధికి చేపట్టిన చెరువు కట్ట నిర్మాణ పనులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (BLR) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని, సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.చెరువు కట్ట నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. చెరువు అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.చెరువు అభివృద్ధితో ఎన్నో ప్రయోజనాలు..చిన్న చెరువు కట్ట పటిష్టంగా నిర్మించడం వల్ల వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. భూగర్భ జలమట్టం పెరిగేందుకు దోహదపడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంది. వర్షాకాలంలో నీటి ప్రవాహాన్ని నియంత్రించడంలో, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంలో చెరువు కీలక పాత్ర పోషిస్తుంది. అదేవిధంగా చెరువు పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు కూడా మేలు చేకూరుతుంది. భవిష్యత్తులో చెరువు పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కూడా అవకాశం ఉంటుంది.పట్టణంలో నీటి వనరుల పరిరక్షణ, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే చేస్తున్న క్షేత్రస్థాయి పర్యటనలు స్థానిక ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి లెక్కల్లో లక్షల గోల్‌మాల్?

- బండమీదిపల్లి, బుద్దారంలో రూ.8.5 లక్షల చొప్పున నిధుల వ్యత్యాసాలు
- నోటీసులతో సరిపెడతారా? రికవరీ ఎప్పటికి?
- మూడు గ్రామాల లెక్కలపై సమగ్ర విచారణ అవసరం



ప్రజావాయిస్/తాండూరు/పెద్దేముల్: మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం అమలవుతున్న స్త్రీనిధి పథకంలో నిధుల లావాదేవీలపై ఆడిట్ అభ్యంతరాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.పెద్దేముల్ మండలంలోని బండమీదిపల్లి, బుద్దారం గ్రామాల్లో రూ.8.5 లక్షల చొప్పున నిధుల వ్యత్యాసాలు గుర్తించినట్లు సమాచారం.మరోవైపు మారేపల్లి గ్రామానికి సంబంధించిన లావాదేవీలపైనా ఆడిట్ అభ్యంతరాలు ఉన్నట్లు తెలుస్తోంది.స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు మంజూరైన రుణాలు, వాటి వసూళ్లు, తిరిగి జమ కావాల్సిన సొమ్ము విషయంలో లెక్కల్లో వ్యత్యాసాలు ఎందుకు వచ్చాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహిళా సంఘాల సభ్యులు వాయిదాల రూపంలో చెల్లించిన సొమ్ము సంబంధిత ఖాతాల్లో సక్రమంగా జమైందా? రికార్డుల్లో నమోదైందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటారా?

బండమీదిపల్లి, బుద్దారం గ్రామాల్లో గుర్తించిన నిధులపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం రికవరీ చేస్తామని అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఎం శివయ్య తెలిపారు. అయితే నోటీసులు జారీ చేయడం మాత్రమే కాకుండా, నిధుల వ్యత్యాసాలకు కారణాలు, బాధ్యులు, రికవరీ చేయాల్సిన మొత్తం, ఇప్పటివరకు జరిగిన రికవరీ వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

మూడు గ్రామాల లెక్కలపై సమగ్ర విచారణ అవసరం

బండమీదిపల్లి, బుద్దారం, మారేపల్లి గ్రామాల్లో స్త్రీనిధికి సంబంధించిన లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.రుణాల మంజూరు నుంచి వసూళ్లు, బ్యాంకు ఖాతాల్లో జమ వరకు ప్రతి లావాదేవీని పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది.మహిళలు చెల్లించిన ప్రతి రూపాయికి లెక్క ఉండాల్సిందే. ఆడిట్‌లో గుర్తించిన వ్యత్యాసాలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, రికవరీని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అధికారులు స్పష్టమైన కాలపరిమితి ప్రకటించాలనే డిమాండ్ వినిపిస్తోంది.



గుర్రాలదండిలో పంచాయతీ పన్నుల వసూళ్లలో గోల్‌మాల్?

- లక్షల్లో రావాల్సిన పన్నులు వేలల్లోనే వసూలవుతున్నాయన్న ఆరోపణలు!
- 12 ఏళ్లుగా పాత పన్నుల విధానమే కొనసాగుతోందా?
- పెట్రోల్ బంకు, పరిశ్రమలు, రైస్ మిల్లుల పన్నులపై అనుమానాలు!
- జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్.

ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామపంచాయతీలో పన్నుల వసూళ్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులు సక్రమంగా సవరించి వసూలు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 12 ఏళ్లుగా పాత పన్నులనే వసూలు చేస్తున్నారని, దీనివల్ల గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతోందని ప్రశ్నిస్తున్నారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు గుంటల స్థలంలో ఉన్న పెట్రోల్ బంకుకు ఏడాదికి కేవలం రూ.4,500, పది ఎకరాలకు పైగా ఉన్న పరిశ్రమకు రూ.56 వేలు, రెండు ఎకరాల రైస్ మిల్లుకు కేవలం రూ.7,500 మాత్రమే పన్ను వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు..! ఈ పన్నుల విధింపు వెనుక ఏ ప్రాతిపదిక ఉందో అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా? పన్నుల మదింపులో అక్రమాలు జరిగాయా? తక్కువ పన్నుల విధింపు వెనుక అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి.జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి గుర్రాలదండి గ్రామపంచాయతీ పరిధిలోని ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లుల పన్నుల రికార్డులను సమగ్రంగా తనిఖీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పన్నుల మదింపులో తప్పులు ఉంటే సరిదిద్ది, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రశ్న ఒక్కటే.. పంచాయతీకి రావాల్సిన ఆదాయం ఎక్కడికి పోతోంది? గ్రామ అభివృద్ధికి నిధులు ఎలా సమకూరుతాయి?

వల్మిడిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపై తీవ్ర చర్చ!

- చాటుమాటున లబ్ధిదారుల ఎంపికలు
- గ్రామ కార్యవర్గానికే తెలియని జాబితా!
- అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందా?
- రాజకీయ పలుకుబడితో తమకు నచ్చిన వారికే ఇళ్ల కేటాయింపులా?
- అధికారుల క్షేత్రస్థాయి విచారణకు గ్రామస్తుల డిమాండ్



ప్రజా వాయిస్ / పాలకుర్తి/నవంబర్ 13జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై గ్రామంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైన పేదలకు న్యాయం జరుగుతోందా? లేక రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ఇండ్లు కేటాయింపుల్లో ప్రాధాన్యత లభిస్తోందా? అనే ప్రశ్నలు గ్రామంలో వినిపిస్తున్నాయి.

గ్రామ కార్యవర్గానికి తెలియకుండానే లబ్ధిదారుల ఎంపికలా?

గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ కార్యవర్గానికి సైతం పూర్తి సమాచారం లేకుండానే చాటుమాటున లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చకు దారి తీస్తోంది. గ్రామ ప్రజలకు, సంబంధిత ప్రజాప్రతినిధులకు స్పష్టమైన సమాచారం లేకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నాయకుల కనుసైగల్లో కేటాయింపులా?

అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల సూచనల మేరకే ఇండ్లు కేటాయింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయి. తమకు అనుకూలమైన వారికే ప్రాధాన్యత కల్పిస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. కొందరికి ఇప్పటికే ఇండ్లు ఉన్నప్పటికీ మళ్లీ లబ్ధి చేకూరుతోందా? ఒకే కుటుంబానికి రెండు, మూడు ఇండ్లు కేటాయింపుల విషయంలో ఏమైనా అక్రమాలు చోటు చేసుకున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

ఇందిరమ్మ ఇళ్లు పార్టీ కార్యకర్తల కోసమా.. నిరుపేదల కోసమా?

ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని అమలు చేస్తోంది. అలాంటి ప్రజా సంక్షేమ పథకం రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు చేరాలి. పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా నిజంగా ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధి చేకూర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిజమైన అర్హులకు అవకాశం కల్పించాలి!

గ్రామంలో సొంత ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలు, ఆర్థికంగా వెనుకబడిన వారు ఇంకా ఎంతోమంది ఉన్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో వివిధ కారణాలతో ఇండ్లు మంజూరు పొందలేకపోయిన అర్హులకు రెండో విడతలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రాజకీయ పలుకుబడి, వ్యక్తిగత పరిచయాలు కాకుండా ప్రభుత్వ మార్గదర్శకాలు, అర్హతలే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించి పారదర్శక విచారణ చేపట్టాలి!

వల్మిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల అర్హతలను మరోసారి పరిశీలించి, జాబితాను పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హత ఉండి కూడా ఇండ్లు పొందని పేద కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.పేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకం రాజకీయ పలుకుబడికి పరిమితం కాకుండా, నిజమైన నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక గ్రామంలో వ్యక్తమవుతున్న అనుమానాలకు సమాధానం లేకుండానే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందా? అన్నది వేచి చూడాలి.

జిల్లాలో ఇటుక బట్టీల దందాకు అడ్డూఅదుపు ఏదీ?

- పర్మిషన్లు, కార్మికుల భద్రత గాలికేనా?
- అనుమతులు లేకుండానే పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బట్టీలు
- మైనింగ్, లీజు, కరెంట్, పొల్యూషన్ పత్రాలు ఉన్నాయా?
- అధికారుల తనిఖీలు ఎక్కడ?
- లేబర్ కార్డులు, ఇన్సూరెన్స్ నిల్
- బాత్రూంలు, కనీస వసతులు లేక కూలీల నరకయాతన
- చదువుకు దూరమై బట్టీల వద్దే నలిగిపోతున్న పసిబాల్యం



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి జిల్లా వ్యాప్తంగా ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే, నిబంధనల ప్రకారం ఇవన్నీ సక్రమంగా నడుస్తున్నాయా?అసలు వీటిలో ఎన్నింటికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి?అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జిల్లాలో పెద్ద ఎత్తున ఇటుక బట్టీలు వెలుస్తున్నప్పటికీ, వాటిపై సంబంధిత శాఖల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే వివిధ శాఖల నుండి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కానీ,జిల్లాలో నడుస్తున్న చాలా బట్టీల వద్ద ఈ పత్రాలు ఉన్నాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.భూమి మరియు లీజు పత్రాలు వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు మార్చిన (NALA) పత్రాలు, చట్టబద్ధమైన లీజు అగ్రిమెంట్లు లేకుండానే బట్టీలను నిర్వహిస్తున్నారా?మైనింగ్ మరియు విద్యుత్: మట్టి తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతులు ఉన్నాయా? కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారా లేక అక్రమంగా కరెంట్ వాడుతున్నారా కాలుష్య నియంత్రణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (PCB) నుండి నిరభ్యంతర పత్రాలు (NOC) తీసుకున్నారా?బట్టీల నుండి వెలువడే పొగ వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఏదీ?కార్మికుల జీవితాలకు భరోసా ఏదీ?ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది.చట్టప్రకారం వారికి అందాల్సిన కనీస హక్కులు ఏవీ అమలు కావడం లేదు.లేబర్ కార్డులు, ఇన్సూరెన్స్ కరువు బట్టీలలో రేయింబవళ్లు కష్టపడుతున్న కూలీలకు కనీసం లేబర్ కార్డులు లేవు.పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారికి ఎలాంటి ఇన్సూరెన్స్ భరోసా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.కార్మికులు ఉండటానికి సరైన నివాస గదులు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించడం లేదు. ముఖ్యంగా మహిళా కార్మికులకు కనీసం బాత్రూంలు (మరుగుదొడ్లు) కూడా లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన కూలీల పిల్లలు బడికి వెళ్లాల్సిన వయసులో,బట్టీల వద్ద దుమ్ముధూళిలో మగ్గుతూ బాల్యాన్ని కోల్పోతున్నారు.ఇటుక బట్టీల నిర్వహణపై రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్, విద్యుత్ మరియు కార్మిక శాఖల అధికారులు ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. పర్మిషన్లు లేని బట్టీలపై చర్యలు తీసుకోవడంతో పాటు, కార్మికులకు లేబర్ కార్డులు, ఇన్సూరెన్స్, బాత్రూంలు వంటి కనీస వసతులు కల్పించేలా అధికారులు కఠినంగా వ్యవహరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి

- ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలు



ప్రజా వాయిస్ గూడూరు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరపంచ బస్టాండ్ సమీపంలోని అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అటవీ ప్రాంతం నుండి ఒక చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా, జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు దానిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ పై నుండి కిందపడిన వాహనదారుడికి తీవ్ర గాయాలు కావడంతో, స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గూడూరు అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన చుక్కల దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.

పేరుకే ఇందిరమ్మ ఇళ్లు.. బిల్లులు కానరాక లబ్ధిదారుల కన్నీటి వేదన!

- అప్పుల ఊబిలో పేదలు
- అప్పులు తెచ్చి ఇళ్లు కడితే.. బిల్లులు మంజూరు కాక అవస్థలు!
- ఆవేదనలో ఇందిరమ్మ లబ్ధిదారులు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధిపేదల సొంతింటి కలను నెరవేరుస్తామన్న ప్రభుత్వ హామీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు శాపంగా మారింది.పేరుకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి కానీ,నెలలు గడుస్తున్నా బిల్లులు మాత్రం చేతికందడం లేదు.ప్రభుత్వం డబ్బులు ఇస్తుందన్న ఆశతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న పేదలు,ఇప్పుడు బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతూ కన్నీటి వేదన అనుభవిస్తున్నారు.ఇంటి నిర్మాణం మధ్యలో ఆగిపోతే నివాసం ఉండలేమనే ఉద్దేశంతో లబ్ధిదారులు తమ వద్ద ఉన్న కొద్దిపాటి బంగారాన్ని తాకట్టు పెట్టి,ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి గోడలు లేపారు.స్లాబ్‌లు వేసి నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే,వివిధ దశలలో రావాల్సిన బిల్లులు సకాలంలో ఖాతాల్లో జమ కాకపోవడంతో వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయి.అప్పులిచ్చిన వారి ఒత్తిడి భరించలేక పేద కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి.మంజూరైన బిల్లుల కోసం లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయాలు,హౌసింగ్ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.సాంకేతిక కారణాలు, నిధుల కొరత అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. కూలి పనులు చేసుకుని జీవించే తమకు ఈ అప్పులు తీర్చే దారి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న పేద కుటుంబాలను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అర్హత లేకున్నా.. సదరం సర్టిఫికెట్లు.!

- అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు.!
- ఒకే గ్రామంలో ముగ్గురికి సర్టిఫికెట్లు జారీ అయినట్లు ఆరోపణలు
- మండలంలోని 20 గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందా.?
- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే ధ్రువీకరణ పత్రాలిచ్చారా.?
- సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ఎంపీడీవో



ప్రజా వాయిస్,అనంతగిరి: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అక్రమాలకు తావులేకుండా చూడాల్సిన అధికారుల పర్యవేక్షణపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజమైన దివ్యాంగులకు అందాల్సిన ఆసరా పెన్షన్లు అనర్హుల ఖాతాల్లోకి వెళ్తున్నాయా, అన్న ప్రశ్నలు అనంతగిరి మండలంలో చర్చనీయాంశంగా మారాయి. అర్హత లేని వ్యక్తులకు సైతం సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి, పెన్షన్లకు అర్హులుగా గుర్తించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని ఓ గ్రామంలోనే ముగ్గురు అనర్హులకు సదరం సర్టిఫికెట్లు మంజూరైనట్లు ప్రచారం జరుగుతుండటంతో వ్యవహారం కలకలం రేపుతోంది.

ఒక్క గ్రామంలో ముగ్గురు.. మిగతా గ్రామాల్లో ఇంకెంతమంది.?

అనంతగిరి మండలంలో మొత్తం 20 గ్రామాలు ఉండగా, ఒక్క గ్రామంలోనే ముగ్గురు అనర్హులకు సర్టిఫికెట్లు జారీ అయ్యాయన్న ఆరోపణలు అధికారుల పరిశీలనా తీరుపై అనేక సందేహాలకు తావిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో వైకల్య పరిస్థితిని పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉంటే అనర్హుల సంఖ్య దాటే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారిక నిర్ధారణ లేదు. కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా వాస్తవాలను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అర్హుల ఎదురుచూపులు.. అనర్హులకు సంక్షేమ ఫలాలు

వైకల్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిజమైన దివ్యాంగులు పెన్షన్ కోసం ఎదురుచూస్తుంటే, అర్హత లేనివారు ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి పరిణామాలు కొనసాగితే ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు లక్ష్యం దెబ్బతినడమే కాకుండా నిజమైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం: అనంతగిరి ఎంపీడీవో సుష్మ

పెన్షన్ల మంజూరులో అర్హత లేని వారికి లబ్ధి చేకూరుతోందన్న ఆరోపణలపై ఎంపీడీవోను వివరణ కోరగా, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హతలను పరిశీలిస్తామని, విచారణలో అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం తొలగిస్తామని స్పష్టం చేశారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



మొక్కజొన్న పంటకు నిప్పు..
- రైతు కుటుంబానికి తీరని నష్టం!

- కష్టపడి పండించిన పంటను కళ్లముందే బూడిద చేసిన దుండగులు
- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం..
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలి వేడుకోలు

ప్రజావాయిస్ / మోమిన్‌పేట:వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని దుర్గం చెరువు గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. భర్త మరణించడంతో కుటుంబ భారాన్ని మోస్తూ తనకున్న పొలంలో కష్టపడి మొక్కజొన్న పంట సాగు చేసిన కంకంటి వెంకటమ్మ (భర్త పాపయ్య)కు గుర్తుతెలియని దుండగులు తీరని నష్టం కలిగించారు.పంటను కోసి కుప్పలుగా పెట్టిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంట ద్వారా సుమారు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించానని, ఎంతో కష్టపడి పండించిన పంట కళ్లముందే బూడిద కావడంతో కన్నీరుమున్నీరవుతున్నానని తెలిపారు.భర్తను కోల్పోయి వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తన కుటుంబానికి ఈ ఘటన కోలుకోలేని దెబ్బ అని, ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై భరత్ భూషణ్, తహసీల్దార్ మునిరొద్దీన్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దోషులను గుర్తించి పట్టుకుని బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.కష్టపడి పండించిన పంటను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధితురాలిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'యంగ్ ఇండియా' స్కూల్ తరలింపుపై రగులుతున్న కొడకండ్ల!

- మండల కేంద్రంలోనే నిర్మించాలని అడిషనల్ కలెక్టర్ కు అఖిలపక్షం వినతి
- ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్!
- రామన్నగూడెం ప్రతిపాదన ఎలా వచ్చింది?
- ఎవరికి లబ్ధి చేకూర్చేందుకీ కుట్ర అంటూ ప్రజల నిలదీత!
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడిని బహిష్కరించిన (బాయ్ కాట్ చేసిన) స్థానిక కాంగ్రెస్ నాయకులు!
- నేనే రాజు.. నేనే మంత్రి' అన్నట్లుగా అధ్యక్షుడి తీరు
- ఎమ్మెల్యే వద్ద చాడీలు చెప్తూ పనులు అడ్డుకుంటున్నారంటూ ఆరోపణలు!
- స్వార్థపరుల ప్రయోజనాల కోసమే విద్యాసంస్థకు అడ్డంకులు
- అఖిలపక్ష నేతల ఆగ్రహం!
- మండల కేంద్రంలో స్కూల్ రాకపోతే స్థానిక సర్పంచ్ రాజీనామా చేయాలని కొడకండ్ల ప్రజల డిమాండ్!



ప్రజా వాయిస్/కొడకండ్ల (జనగామ జిల్లా) జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్'ను నిర్మించాలని కోరుతూ కొడకండ్ల గ్రామ సర్పంచ్ దూలం మమతా సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీలకు అతీతంగా అఖిలపక్ష నాయకులు కదం తొక్కారు. కొడకండ్ల ఎమ్మార్వో (MRO) కార్యాలయంలో జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ ను కలిసి రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

రామన్నగూడెం ప్రతిపాదన వెనుక మతలబేంటి?

ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోనే స్కూల్ నిర్మిస్తామని స్థానిక పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు స్వార్థపరులు తమ సొంత ప్రయోజనాల కోసం స్కూల్ నిర్మాణానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అసలు 'రామన్నగూడెం' ప్రతిపాదన తెరపైకి ఎలా వచ్చిందో, ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు స్కూల్‌ను తరలించే ప్రయత్నం చేస్తున్నారో బహిర్గతం చేయాలని ప్రజలు నిలదీస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని అన్ని అడ్డంకులను అధిగమించి మండల కేంద్రంలోనే పాఠశాల నిర్మాణం చేపట్టాలని కోరారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడి బాయ్ కాట్.. 'నేనే రాజు'నేనే మంత్రి' తీరుపై ఆగ్రహం!

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని పూర్తిగా బహిష్కరించడం (బాయ్‌కాట్ చేయడం) మండలంలో చర్చనీయాంశమైంది. సదరు మండల అధ్యక్షుడు "నేనే రాజు.. నేనే మంత్రి" అన్నట్లుగా వ్యవహరిస్తూ, సామాన్య కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు, నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఎమ్మెల్యే వద్ద సొంత పార్టీ కార్యకర్తలపైనే లేనిపోని చాడీలు చెప్పడం, నియోజకవర్గంలో ఏ పని కావాలన్నా తాను చెప్తేనే జరిగేలా చక్రం తిప్పుతూ ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.

సర్పంచ్ రాజీనామాకు ప్రజల డిమాండ్:

మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరగకపోతే, నైతిక బాధ్యత వహిస్తూ స్థానిక సర్పంచ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కొడకండ్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వినతిపత్రం అందించిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండీ షన్నా, మాజీ సర్పంచ్ పసునూరి మధుసూదన్, నాయకులు ఎన్నం శ్రీనివాస్, కోటేశ్వర రావు, మాసురం రవీందర్, మోడేపల్లి సోమన్న, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్య కోరల్లో చౌటుప్పల్.!

- ప్రజల ఆరోగ్యంతో పాటు పంటలు, భూగర్భ జలాలకు ముప్పు
- రాత్రివేళల్లో రసాయన దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి
- అనుమతులిచ్చి చేతులు దులుపుకున్నారా.?
- కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలు ఏవీ.?
- బీజేపీ లేబర్ సెల్ జిల్లా కో-కన్వీనర్ నరేందర్ గౌడ్ ఆగ్రహం





ప్రజావాయిస్,చౌటుప్పల్: పరిశ్రమల కాలుష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఫార్మా కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయన కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, భూగర్భ జలాలు ప్రమాదంలో పడుతున్నాయని బీజేపీ లేబర్ సెల్ జిల్లా కో-కన్వీనర్ మాదగోని నరేందర్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చిన అధికారులు కాలుష్య నియంత్రణ నిబంధనల అమలుపై మాత్రం దృష్టి సారించడం లేదని విమర్శించారు.రాత్రివేళల్లో కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయన దుర్వాసనతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రసాయన వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండానే బయటకు విడుదల చేస్తున్నారనే ఆరోపణలున్నాయని, ఫలితంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి రంగు మారడంతో పాటు దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ఫ్లోరైడ్ సమస్యతో సతమతమవుతున్న ప్రజలకు రసాయన కాలుష్యం మరో ప్రమాదంగా పరిణమిస్తోందన్నారు. కలుషిత నీటి కారణంగా పరి, ఇతర పంటలు దెబ్బతింటున్నాయని, రైతులు నష్టపోతున్నారని తెలిపారు. దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోలేని పరిస్థితి నెలకొందని అన్నారు.పరిశ్రమల లాభాలే ముఖ్యమా.. ప్రజల ప్రాణాలు పట్టవా అని ప్రశ్నించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణమే స్పందించి ఫార్మా కంపెనీలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాత్రివేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గాలి, తాగునీరు, భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం కొనసాగితే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అమావాస్య వస్తే తాంత్రిక పూజల పేరుతో కాసుల వర్షం

- మీడియా ముసుగులో అమాయకులకు వల?
- కోయ పూజారులు, అమ్మవారి ఉపాసకుల పేరుతో వసూళ్ల ఆరోపణలు
- ఒక్కో పూజకు రూ.30 వేల నుంచి లక్ష వరకు వసూలు చేస్తున్నారన్న బాధితులు
- గుప్తనిధుల తవ్వకాల పేరుతోనూ మోసాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు
- ప్రముఖులు, అధికారుల పేర్లు ప్రస్తావిస్తూ నమ్మిస్తున్నారన్న ప్రచారం
- ప్రజా వాయిస్ కథనంతో ఒక్కొక్కరుగా ముందుకొస్తున్న బాధితులు
- త్వరలో ప్రజా వాయిస్ మార్నింగ్ లైవ్ షోలో బాధితుల ప్రత్యక్ష గళం



ప్రజా వాయిస్ పెద్దపల్లి మీడియా వృత్తిని అడ్డుపెట్టుకుని కొందరు వ్యక్తులు తాంత్రిక పూజలు, క్షుద్ర విద్యలు, గుప్తనిధుల తవ్వకాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు కోల్‌బెల్ట్ ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. గతంలో వెలువడిన 'కలం ముసుగులో క్షుద్ర పూజల దందా' కథనంతో ఈ వ్యవహారంపై బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఈ అంశంపై చర్చ సాగుతోంది. కొన్నేళ్లుగా అఘోరాలు, తాంత్రిక పూజల పేరుతో పరిచయాలు పెంచుకుంటూ కొందరి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమావాస్య వచ్చిందంటే ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, వాటి ద్వారా వ్యక్తిగత సమస్యలు తొలగిపోతాయని, పదోన్నతులు, వ్యాపారాభివృద్ధి, ఉద్యోగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నమ్మిస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. కోయ పూజారులు, అమ్మవారి ఉపాసకుల పేర్లు ప్రస్తావిస్తూ కొందరిని తీసుకువచ్చి నిర్మానుష్య అటవీ ప్రాంతాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పూజకు రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొంటున్నారు. పూజలు నిర్వహించే వారికి కొంత మొత్తం చెల్లించి, మిగిలిన డబ్బును మధ్య వర్తులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సింగరేణి ఉన్నతాధికారులు, కొందరు పోలీసు సిబ్బందిని సైతం సంప్రదించి వారి వ్యక్తిగత సమస్యలను ఆసరాగా చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చివరకు కొందరు మీడియా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులను కూడా ఈ వ్యవహారంలోకి లాగి పూజల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. మంచిర్యాల జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతాలు, పురాతన కట్టడాలు, ఆలయాల వద్ద బంగారు కడ్డీలు, విలువైన ఆభరణాలు ఉన్నాయంటూ కొందరు అమాయకులను నమ్మించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అమావాస్య రోజుల్లో ప్రత్యేక పూజలు చేసి గుప్తనిధులు వెలికితీస్తామని చెప్పి బెల్లంపల్లి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లినట్లు సమాచారం. ముందస్తు ప్రణాళికలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో నకిలీ బంగారు ఆభరణాలు, కడ్డీలు పాతిపెట్టి, తవ్వకాల సమయంలో వాటిని బయటకు తీసి నిజమైన నిధులుగా నమ్మించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బెల్లంపల్లి శివారులోని ఓ పురాతన కట్టడం వద్ద జరిగినట్లు చెబుతున్న తవ్వకాల వ్యవహారం అప్పట్లో స్థానికంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. పోలీసుల రాకతో కొందరు అక్కడి నుంచి వెళ్లిపోయారన్న ప్రచారం కూడా ఉంది. ఈ వ్యవహారంపై అధికారిక వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కోల్‌బెల్ట్‌కు చెందిన కీలక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులకు తానే ప్రత్యేక పూజలు నిర్వహించానని, వాటి తర్వాత వారికి మంచి జరిగిందని చెబుతూ ఇతరులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రముఖుల పేర్లను ప్రస్తావించడం ద్వారా తమ మాటలకు విశ్వసనీయత కల్పించి, పూజల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కోల్‌బెల్ట్‌లో దశాబ్దాల చరిత్ర కలిగిన ఓ ప్రతిష్టాత్మక సంస్థ పేరును కొందరు తమ వ్యవహారాలకు రక్షణగా ఉపయోగించుకుంటున్నారన్న ప్రచారం కూడా చర్చకు వస్తోంది. ఈ ఆరోపణల్లో వాస్తవాలేమిటన్నది విచారణతోనే తేలాల్సి ఉంది. గతంలో ప్రచురితమైన కథనం తర్వాత మరికొందరు బాధితులు తమకు ఎదురైన అనుభవాలను వెల్లడించేందుకు ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది. తాంత్రిక పూజలు, గుప్తనిధుల తవ్వకాల పేరుతో తాము ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని, జరిగిన పరిణామాలను బయటపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కొందరు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించేందుకు కూడా సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మరింత స్పష్టత తీసుకువచ్చేందుకు ప్రజా వాయిస్ ప్రత్యేకంగా మార్నింగ్ లైవ్ షో నిర్వహించనుంది. తాంత్రిక పూజలు, క్షుద్ర విద్యలు, గుప్తనిధుల తవ్వకాల పేరుతో మోసపోయామని ఆరోపిస్తున్న బాధితులు ప్రత్యక్ష ప్రసారంలో తమ అనుభవాలను వెల్లడించనున్నారు. ఎలా పరిచయమయ్యారు? ఏం చెప్పి నమ్మించారు? ఎంత డబ్బు వసూలు చేశారు? పూజల పేరుతో తెరవెనుక ఏం జరిగింది? గుప్తనిధుల తవ్వకాల వ్యవహారంలో అసలు ఏం జరిగింది? వంటి అంశాలపై బాధితుల వాంగ్మూలాలను ప్రజల ముందుకు తీసుకురానుంది ప్రజా వాయిస్. తాంత్రిక పూజలు, గుప్తనిధుల తవ్వకాల పేరుతో ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందితే పోలీసులు సమగ్రంగా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. బెల్లంపల్లి, ఆసిఫాబాద్ పరిసర అటవీ ప్రాంతాల్లో జరిగినట్లు చెబుతున్న తవ్వకాల వ్యవహారాలపైనా సంబంధిత శాఖలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మీడియా వృత్తి ప్రజలకు అండగా నిలవాలి తప్ప, ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకునే సాధనంగా మారకూడదు. ఆరోపణల్లో వాస్తవాలేమిటి? బాధితుల వెనుక ఉన్న కథలేమిటి? అధికారుల స్పందన ఏమిటి? అన్నది త్వరలో ప్రజా వాయిస్ మార్నింగ్ లైవ్ షోలో వెలుగులోకి రానుంది.



అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా!

- రెండు ట్రాక్టర్లు పోలీసుల అదుపులో
- అర్ధరాత్రి అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు!
- అక్రమార్కులకు ఉపేక్షించేది లేదు:ఎస్ఐ విట్టల్ రెడ్డి

ప్రజావాయిస్/యాలాల్: కాగ్నా బ్రిడ్జి వద్ద అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు చర్యలు చేపట్టారు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం తెల్ల వారుజామున పోలీసులు పట్టుకొని యాలాల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం. మొదటి ట్రాక్టర్ ఏపీ28టి.ఈ3937, ట్రాలీ నంబర్ ఎపి36ఎల్9464 కాగా డ్రైవర్ జక్కేపల్లికి చెందిన బ్యాగరి నరేష్‌గా గుర్తించారు. రెండో ట్రాక్టర్ మహేంద్ర 575 ట్రాక్టర్ కాగా, డ్రైవర్ బెన్నూరుకు చెందిన ఎండీ ముజీబ్‌గా గుర్తించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు సహకరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు అక్రమ ఇసుక రవాణా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ విఠల్ రెడ్డి కోరారు.

వృధాగా పోతున్న నీటిపై అధికారులు కన్నేయాలి

- లీకేజ్ అవుతున్న పైప్ లైన్ బాగు చేయించాలి
- లీకేజ్ పై పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజా వాయిస్ / దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో నీరు వృధా పోతున్న పట్టించుకోని వైనం.. పట్టణంలోని స్థానిక పి ఎస్ సి ఎస్ కార్యాలయం ముందు నూతనంగా ఇంటిని నిర్మించుకుంటున్నారు. అక్కడ చెట్టు ఉండేదట.. ఆ చెట్టును తీస్తా ఉంటే మిషన్ భగీరథ పైప్లైన్ కు జెసిబి కోరలు తగిలి రంధ్రం పడినట్లు అట్టి వార్డు సభ్యులు తెపుతున్నారు. గత వారం రోజులు అవుతున్న మరమ్మతు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పిఎస్ సిఎస్ కార్యాలయం ముందు నీటి వృధాను అరికట్టాలని, వెంటనే మరమ్మతు పనులను చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



కాళోజి ఆశయాలే సమాజానికి స్ఫూర్తి

కాళోజికి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఘన నివాళులు

నాగుల చవితి వేడుకల్లో ప్రత్యేక పూజలు

ప్రజా వాయిస్, కోదాడ:

మహాకవి కాళోజి నారాయణరావు 24వ వర్ధంతి సందర్భంగా కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. కోదాడ పట్టణంలోని తన నివాసంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళోజి తెలంగాణ ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని, తన కలంతో అన్యాయాలపై పోరాడిన ప్రజాకవి అని కొనియాడారు. ఆయన ఆశయాలు, రచనలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు



షేక్ నయం, సోంపేట ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకల్లో ప్రత్యేక పూజలు

నాగుల చవితి పర్వదినం సందర్భంగా తమ్మరబండపాలెంలోని శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో నిర్వహించిన 40వ వార్షికోత్సవ వేడుకల్లో బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో,



పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వేడుకలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోదాటి కృష్ణయ్య, కనగాల శ్రీధర్, ఆలయ చైర్మన్ బొల్లు సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు జె యన్ టీ యు లో మెగా జాబ్ మేళ

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

ఆందోల్ నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నవంబర్ 15, ఆదివారం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు.ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జీచీఖ కళాశాల, సుల్తాన్‌పూర్, చౌటకూరు మండలం వేదికగా జాబ్ మేళా జరగనుంది.ఈ జాబ్ మేళా ద్వారా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. 10వ తరగతి నుంచి పై చదువులు చదివిన అభ్యర్థులు అర్హులు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.



ఉద్యోగ వివరాలు:

నెల జీతం: 19,288

పని ప్రదేశం: కొంగర కలాన్, కేకే పార్క్, హైదరాబాద్

విధులు: రొటేషనల్ షిఫ్ట్ విధానం

వారానికి ఒకరోజు సెలవు

ఉచిత భోజనం, ఉచిత రవాణా సదుపాయం

అభ్యర్థులు తీసుకురావాల్సిన పత్రాలు:

1. ఆధార్ కార్డు
2. పాన్ కార్డు
3. పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు
4. బ్యాంక్ పాస్‌బుక్
5. విద్యార్హత సర్టిఫికెట్లు

అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పూర్తి వివరాలకు రాధిక – 9059618521, నవీన్, 9398946830 మూర్తి 7842461759 లను సప్రదిచాలని వారు సూచించారు.

ఆపద సమయాల్లో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో 108, 102 అంబులెన్స్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి

ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకొని ప్రాణాలను కాపాడుకోవాలి

ఉమ్మడి జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

అత్యవసర పరిస్థితుల్లో ఏమాత్రం ఆలస్యం చేయకుండా 108, 102 నంబర్లకు ఫోన్ చేసి అంబులెన్స్ సేవలను పొందాలని సూచించారు.శుక్రవారం వీపనగండ్ల మండల కేంద్రంలోని 108, 102 అంబులెన్స్ వాహనాలను కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, అత్యవసర మందులు, ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర వైద్య సామగ్రిని పరిశీలించారు. వాహనాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..రోడ్డు, అగ్ని తదితర ప్రమాదాలు జరిగినప్పుడు, గుండెపోటు, శ్వాస సంబంధిత సమస్యలు, పక్షవాతం, ఇతర అత్యవసర అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు 108 అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. గర్భిణులకు ప్రసవ సమయంలో అత్యవసర వైద్య సహాయం అందించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో వారిని సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంలో 108 సేవలు కీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా 102 అంబులెన్స్ సేవలు ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, శిశువులకు ఆసుపత్రులకు వెళ్లేందుకు, ప్రసవానంతరం తిరిగి ఇంటికి చేరేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.అంబులెన్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, వాహనాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. రోగులకు సకాలంలో వైద్య సహాయం అందించడంతో పాటు, మానవతా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. అత్యవసర సేవలను అవసరం ఉన్నవారే వినియోగించుకోవాలని, అనవసర కాల్స్ చేయకుండా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్న 108, 102 అంబులెన్స్ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో అంబులెన్స్ టెక్నీషియన్ రాము, పైలెట్ శివయ్య ఉన్నారు.



పాలేరులో ఘనంగా 'చేయూత' పింఛన్ల పంపిణీ

నేలకొండపల్లిలో 1,138 మందికి కొత్త చేయూత పింఛన్లు అందజేత

మహిళలను కోటీశ్వరులు చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

కమిషన్ల కోసం కాళేశ్వరం.. కడుపు నింపేందుకు పేదవాడికి ఇల్లు, పింఛన్!

రైతులను ఆదుకునేందుకే యూనిట్ రూ. 15 పెట్టి కరెంట్ కొన్నాం: మంత్రి పొంగులేటి

సంక్షేమంలో పార్టీలు చూడబోం.. పింక్ చొక్కా వేసుకుని వచ్చినా ఇల్లు ఇస్తాం!

ప్రజా వాయిస్,ఖమ్మం:

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుండి వందలాది మంది కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ బైక్ ర్యాలీగా బయలుదేరిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి... నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకున్నారు. అనంతరం మండల నలుమూలల నుండి విచ్చేసిన అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.5 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేశామని వెల్లడిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ఇందిరమ్మ



ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిపక్షంపై ఆయన తనదైన శైలిలో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల మందికి పైగా చేయూత పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. పేదలకు భరోసా, భద్రత కల్పించడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వం 73 వేల కోట్ల రూపాయల అప్పుల సున్నాలు మిగిల్చి చేసిన విధ్వంసం నుండి రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరం కడితే కమిషన్లు వస్తాయి, కానీ పేదవాడికి ఇల్లు, పింఛన్ ఇస్తేనే నిజమైన సంక్షేమం అందుతుందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమిషన్ల కోసం కట్టారని, పేదవాడికి ఇల్లు కట్టిస్తే తమకేం వస్తుందనేది గత పాలకుల ఆలోచన అని విమర్శించారు.మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం 'మహిళా శక్తి' పథకం ద్వారా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులను ప్రారంభించడం జరిగిందని మంత్రి తెలిపారు. అలాగే రైతును రాజు చేయాలనే లక్ష్యంతో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి, రైతు భరోసాకు శ్రీకారం చుట్టడంతో పాటు సన్న వడ్లకు బోనస్ అందించామని చెప్పారు. ప్రపంచం మొత్తం ఎల్ నినోతో సతమతమవుతున్న తరుణంలో, రైతులు అప్పుల ఊబిలో పడకుండా మరియు పంట నష్టపోకుండా యూనిట్ రూ. 15 పెట్టి మరీ కరెంట్ కొనుగోలు చేసి పంటలను కాపాడిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.సంక్షేమ పథకాల విషయంలో జాతి, కులం, మతం, రాజకీయ పార్టీల భేదాలు అసలు చూబోమని మంత్రి తేల్చిచెప్పారు. రేపు పొద్దున మీలో ఎవరైనా సరే, కావాలంటే పింక్ చొక్కా వేసుకుని వచ్చినప్పటికీ... అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు కచ్చితంగా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి మాటను, మిగిలిన హామీలను కూడా రాబోయే రోజుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి తప్పకుండా అమలు చేసి తీరుతామని ఆయన పునరుద్ఘాటించారు.





అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన వేడుకలు

ఎర్రగుంట తండాలో చిన్నారులకు తొలి ముద్ద

పౌష్టికాహారంపై అవగాహన కల్పించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత

ప్రజా వాయిస్,చింతలపాలెం:



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని ఎర్రగుంట తండా గ్రామ అంగన్వాడీ ఫస్ట్ సెంటర్‌లో చిన్నారుల అన్నప్రాసన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కోదాడ సూపర్‌వైజర్ సరిత చిన్నారులకు అన్నప్రాసన చేసి ఆశీర్వదించారు. చిన్నారుల ఎదుగుదలలో తొలి ఆహారం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని, పిల్లలకు వయసుకు తగిన పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని వివరించారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంతో పాటు శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బి.నగ్మా, చింతలపాలెం తండా పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు: 'నషా ముక్త యువ' సదస్సులో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పిలుపు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి



యువత దేశానికి అసలైన సంపద అని,క్షణికావేశంలో మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును, విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హితవు పలికారు.నిర్మల్ పట్టణంలో నిర్వహించిన 'నషా ముక్త యువ – వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నేటి యువతలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే తీవ్రమైన దుష్పరిణామాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.యువత తమలోని అపారమైన శక్తి సామర్థ్యాలను చెడు అలవాట్ల వైపు కాకుండా,దేశాభివృద్ధికి మరియు సమాజ నిర్మాణానికి వినియోగించడం శ్రేయస్కరమని ఆయన పేర్కొన్నారు.మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని,ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన యువతతోనే 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) నిర్మాణం సాధ్యమవుతుందని ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,జిల్లా యువజన అధికారి రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు జమాల్ పాల్గొన్నారు.వీరితో పాటు కౌన్సిలర్లు సాదం అరవింద్, గంజి రాజు, జింక సురేందర్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, ఈశ్వర్, బీజేపీ నాయకులు కందుల హరీష్, భరత్ మరియు పెద్ద ఎత్తున విద్యార్థులు, యువకులు తదితరులు హాజరయ్యారు.



ఉన్నత లక్ష్యాలను సాధించాలి

విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే బీఎంఆర్

ప్రజావాయిస్/తాండూరు/యాలాల్:

యాలాల మండలం జుంటుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తూ వారి చదువులు, పాఠశాలలోని సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులపై చేసే ఖర్చు భావితరాల భవిష్యత్తుకు పెట్టుబడి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఖాసీం అలీ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగులచవితి సందర్భంగా ప్రజలకు పాల్వాయి స్రవంతి శుభాకాంక్షలు

ప్రజా వాయిస్ / మునుగోడు:



నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు ప్రజలందరికీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాగదేవతల అనుగ్రహంతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నాగదేవతల కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని, సమాజంలో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని పాల్వాయి స్రవంతి ఆకాంక్షించారు.



ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

ఫెన్సింగ్ కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి

పటాన్ చెరువు ప్రజావాయిస్

ఫెన్సింగ్ కాలనీ ఏరియాలో స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని పటాన్చెరు నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డిలు అన్నార భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఫెన్సింగ్ ఏరియా కాలనీలో స్థానిక కాలనీవాసులతో విద్యుత్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు కాలనీలో ఇళ్లకు ఆనుకుని, నివాసితులకు ఇబ్బందికరంగా ఉన్న చిన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. ఈ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ ూణజు నాగరాజు, ూజు తిరుపతమ్మ మరియు కాంట్రాక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. చిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో పెద్ద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్,నరసింహ, జైపాల్, కొండల్, జాకీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ... కన్నీళ్లు పెట్టిస్తున్న కూతురి వీడ్కోలు

కూతురిగా పుట్టినా కొడుకుగా బాధ్యత నెరవేర్చిన కూతురు

ప్రజా వాయిస్ కొత్త గూడ



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం రామన్నగూడెం తండా గ్రామపంచాయతీ పరిధిలోని కొర్ర తండాలోమూడు దంజ మృతి హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది....తండ్రిని కోల్పోయిన తన ఒక్కగానొక్క కూతురు... కన్నీటిని దిగమింగుకుంటూ తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.కూతురిగా పుట్టినా కొడుకుగా బాధ్యత నెరవేర్చి... కన్నతండ్రికి చివరి వీడ్కోలు పలికింది.తండ్రి రుణం తీర్చుకున్న తనయ... ఈ దృశ్యం చూసినగ్రామస్తులు ప్రతి ఒక్కరి కళ్లలో కన్నీళ్లు పెట్టు కున్నారు

జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ డాన్స్ లో ఓటాయిజెడ్పీ హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థి కి ప్రథమ బహుమతి

సాయికృష్ణకుఅభినందనలుతెలిపిన ఉపాధ్యాయులు

ప్రజా వాయిస్

కొత్తగూడ



ప్రత్యేక అవసరాలు గల పిల్లల జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో డాన్స్ లో జెడ్పీ హెచ్ ఎస్ ఓటాయి పాఠశాల విద్యార్థి కి ప్రథమ బహుమతి.ఈ రోజు మహబూబాబాద్ జిల్లా స్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్పోర్ట్స్ మీట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివిధ విభాగలాలలో జరిగిన సి డబ్ల్యూ యస్ స్పోర్ట్స్ మీట్ లో సాంస్కృతిక కార్యక్రమాల విభాగం లోని డాన్స్ లో కొత్తగూడ మండలం లోని జడ్ పి యచ్ యస్ ఓటాయి పాఠశాలకు చెందిన 7వ తరగతి చదువుతున్న మాలోత్ సాయి కృష్ణ కు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి ని ఏ సి జి ఈ మందుల శ్రీరాములు చేత జిల్లా స్థాయి ప్రథమ బహుమతి అందుకున్నందుకు ఆ పాఠశాల ప్రాధనోపాధ్యాయురాలు అరోజు రమాదేవి గైడ్ టీచర్ డాక్టర్ పులుసం సాంబయ్య ఐ ఈ ఆర్ టి టీచర్స్ జమున, బిక్ష పతి,శ్రీనివాస్ మరియు ఓటాయి పాఠశాల బృందం సాయి కృష్ణ కు హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు

తెలంగాణ మలిదశ ఉద్యమ నేత దుండిగల్ నారాయణకు ఘన నివాళి

ప్రజా వాయిస్ । హుజూర్ నగర్ ।నవంబర్ 13

తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, జాగృతి హుజూర్‌నగర్ పట్టణ కన్వీనర్ దుండిగల్ నారాయణ విజయవాడ లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల పట్టణంలోని ఉద్యమకారులు, పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారాయణ భౌతికకాయానికి తెలంగాణ మలిదశ ఉద్యమకారుల కన్వీనర్ మేకల నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే నారాయణ హుజూర్‌నగర్ పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేశారని నిరుపేద కుటుంబంలో జన్మించి పూట గడవని కష్ట పరిస్థితుల్లో సైతం ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఉద్యమ సమయంలో ఎన్నో అక్రమ కేసులను, పోలీసు నిర్బంధాలను నారాయణ మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నారని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై నల్లజెండాలు ఎగురవేయాలని జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు, పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ నల్లజెండా ఎగురవేసిన ధీశాలి అని ప్రశంసించారు. తోటి ఉద్యమకారులందరితో ముద్దుగా 'నారి' అని పిలిపించుకున్న ఆయన నేడు అమరుడయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండిగల్ నారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆయన కలలుగన్న ప్రజాస్వామిక తెలంగాణ సాకారమయ్యేంత వరకు ఉద్యమకారులు పోరాటాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల అధ్యక్షుడు సామా అంజిరెడ్డి, నాయకులు కేఎల్ఎన్ రావు,



దొడ్డ నరసింహారావు, జాగృతి ఎస్కే మస్తాన్, నూకల చంద్రం, బిక్షం, గోవర్ధన్, సుధాకర్, దొడ్డ రాజేష్, సిహెచ్ నరసింహారావు, వేణు, మామిడి పన్నీరు తదితరులు పాల్గొని నారాయణ మృతికి సంతాపం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించొద్దు

బయ్యారం మండల అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య

ప్రజా వాయిస్, బయ్యారం..



ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.బయ్యారం మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, వివిధ శాఖల పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు, పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు.అలాగే ప్రజా ప్రభుత్వం తరఫున తురక కాసి సంఘానికి మంజూరైన యంత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని సంఘం సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో నీరు, విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతులు బోర్లు ఏర్పాటు చేసుకోవడం, తమ భూములను సాగు చేసుకునే విషయంలో అటవీ శాఖ అధికారుల అభ్యంతరాలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని



హెచ్చరించారు. రైతుల సమస్యల పట్ల అధికారులు సానుకూలంగా స్పందిస్తూ వారికి న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు మెరుగైన విద్య, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో బయ్యారం మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు...

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఛట్ పూజ సందర్భంగా 50 వేల మంది ఉత్తర భారతీయులకు 10 లారీల చెరుకు పంపిణీ

పటాన్ చెరువు ప్రజావాయిస్



భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్చెరు నియోజకవర్గం నిలుస్తోందని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ పురస్కరించుకొని శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. నియోజకవర్గ పరిధిలోని పటాన్చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్పూర్, గుమ్మడిదల, బొంత పల్లి, ఖాజీపల్లి, తదితర ప్రాంతాలలో నివసిస్తున్న 50 వేల మంది ఉత్తర భారతీయులకు 10 లారీల చెరుకును సొంత నిధులతో కొనుగోలు చేసి ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం తగు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా పటాన్చెరు సాకి చెరువు కట్ట పైన ఛట్ పూజ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేష్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి

- వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి

- యంగ్ ఇండియా పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీ.ఎస్ సంజయ్ జాజు

ప్రజా వాయిస్ సంగారెడ్డి:



రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళికను రూపొందించాలని, రైతులను వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. కూరగాయలు వంటి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశించారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీజీరాంజీ పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ పలు అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని, పంటల వైవిధ్యీకరణ, పంటల ఉత్పాదకత పెంపు, రైతు రిజిస్ట్రీ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాలని, రైతులందరి వివరాల నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించాలని ఆదేశించారు.సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సూచించారు. భూసేకరణ ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సీఎస్ సూచించారు. వీబీజీరాంజీ కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జలసిరి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి కలెక్టర్ ప్రతీక్ జైన్,అదనపు కలెక్టర్ పాండు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు...

పలు గ్రామాలలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

సిర్గాపూర్‌లో రూ.1.40 కోట్లతో బీటీ రోడ్డు, వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం

బన్సపెల్లిలో రూ.30 లక్షలతో ధాన్యం గోదాం, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

దిలావర్‌పూర్‌లో రూ.27 లక్షలతో సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదులు ప్రారంభం

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమన్న బీజేఎల్పీ నేత





నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి:

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నియోజకవర్గంలోని సిర్గాపూర్, బన్సపెల్లి, దిలావర్‌పూర్ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన విద్యా సంబంధిత భవనాలను ప్రారంభించారు.

సిర్గాపూర్, బన్సపెల్లిలలో రవాణా,నిల్వ సౌకర్యాలకు పెద్దపీట

సిర్గాపూర్ గ్రామంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి నిధుల ద్వారా రూ.1 కోటి 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు,వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.ఈ రహదారి, వంతెన నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరనున్నాయి. అనంతరం బన్సపెల్లి గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ధాన్యం నిల్వ గోదాం మరియు అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.గోదాం నిర్మాణంతో స్థానిక రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరుచుకోవడానికి ఎంతో వెసులుబాటు కలగనుంది.దిలావర్‌పూర్‌లో విద్యా వసతుల ప్రారంభం విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు అందించే దిశగా దిలావర్‌పూర్ పాఠశాలలో రూ.27 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల (సైన్స్ ల్యాబ్), అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, గోదాంలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల్లో విద్యా సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అభివృద్ధి కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సిర్గాపూర్ సర్పంచ్ చైతన్య శంకర్ రెడ్డి, ఉపసర్పంచ్ సాగర్, బన్సపెల్లి సర్పంచ్ మల్లేష్, ఉపసర్పంచ్ ముత్యం, దిలావర్‌పూర్ సర్పంచ్ అక్షయ అనిల్ పాల్గొన్నారు.వీరితో పాటు బీజేపీ సీనియర్ నాయకులు దొడ్డికింది ముత్యం రెడ్డి, తక్కల రమణ రెడ్డి, జమాల్, సత్యం చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

భగవాన్ బిర్సా ముండా 151 వ జయంతి సందర్భంగా నవంబర్ 15 నా ర్యాలీ విజయవంతం చేయాలి

బిజెపి గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర కిషన్ నాయక్

ప్రజా వాయిస్/ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా ఆఫీసులో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు ఈ సమావేశంలో జన జాతీయ గౌరవ దివస్ "భగవాన్ బిర్సా ముండా" 151 వ జన్మదిన సందర్భంగా నవంబర్ 15 ఉదయం 8:30 స్వామి వివేకానంద విగ్రహం నుండి కొమురం భీం విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీకి విజయవంతం చేయగలరని యాదాద్రి భువనగిరి జిల్లా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర కిషన్ నాయక్ జిల్లా కమిటీ తో పెద్ద ఎత్తున తరలిరావాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య నరేష్ నాయక్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంచార్జి అచ్చయ్య గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్ నాయక్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బిచ్చ నాయక్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీం బస్తీలో ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతి నివాళులర్పించిన తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్!

అధికారం ముందు తలవంచకుండా ప్రజల పక్షాన నిలిచిన ధీశాలి కాళన్న అని కొనియాడిన నేతలు

తెలంగాణ యాసకు, భాషకు, ఆత్మగౌరవానికి తన రచనలతో విశేష గుర్తింపు తెచ్చారని ప్రశంస

కాళోజీ ఆశయాల స్ఫూర్తితో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపు

ప్రజా వాయిస్, ఆదిలాబాద్ /

ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని కొమరం భీం బస్తీలో శుక్రవారం తుడుం దెబ్బ మండల సంఘం ఆధ్వర్యంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ... 1914 సెప్టెంబర్ 9న జన్మించి 2002 నవంబర్ 13న తుదిశ్వాస విడిచిన కాళోజీ నారాయణరావు తన జీవితమంతా ప్రజాస్వామ్య విలువల కోసం, సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించడమే కాకుండా స్వాతంత్ర్య, ఆర్యసమాజ, గ్రంథాలయ ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. సమాజంలో నెలకొన్న కుల వివక్ష, అంటరానితనం, దోపిడీ, అన్యాయాలపై తన కలం ద్వారా నిరంతరం గళమెత్తిన సామాజిక చైతన్యవాది కాళన్న అని అన్నారు. ఆయన రచించిన 'నా గొడవ' తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, తెలంగాణ మాండలిక భాషకు, యాసకు సముచిత గౌరవాన్ని తీసుకొచ్చారని తెలిపారు.అణగారిన వర్గాలు, ఆదివాసీలు, దళితులు, బహుజనులు, కార్మికులు మరియు రైతుల హక్కుల పోరాటాలకు కాళోజీ ఆశయాలు నేటికీ నిరంతర స్ఫూర్తినిస్తున్నాయని గోడం గణేష్ పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషారావు, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం రేణుక, రాష్ట్ర కార్యదర్శి ఉయిక ఇందిర, విభాగ అధ్యక్షుడు ఆత్రం గణపతి, మండల అధ్యక్షుడు వెడ్మ ముకుందరావు, నాయకులు కుమ్ర గోవిందరావు, కనక మనోహర్, సీడం ప్రభు, కొమురం మల్కు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ ప్రారంభించినా ధాన్యం కొనుగోళ్లు ఎందుకు చేపట్టడం లేదు?

రైతులను దళారుల పాలు చేస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యం

: మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్

ప్రజా వాయిస్, మానకొండూర్ (నవంబర్ 13)::



మానకొండూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్, కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు సందర్శించారు. మార్కెట్ యార్డును ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రసమయి బాలకిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జీవి రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్రంలో కేంద్ర మంత్రి, రాష్ట్రంలో రాష్ట్ర మంత్రి ఉన్నప్పటికీ కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్షాలపై విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి, సర్పంచ్ శేఖర్ గౌడ్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, ఎల శేఖర్ బాబు తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో వ్యక్తి జీవితమే కాదు.. వ్యవస్థకే పెను ముప్పు

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత

ప్రజావాయిస్ వెంకటాపురం:





డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం సమాజ వ్యవస్థకు పెను ముప్పుగా మారుతుందని జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత అన్నారు. శుక్రవారం వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలో సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజ్ అధ్యక్షతన యువతకు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ, అవగాహన కార్యక్రమం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రేమలత మాట్లాడుతూ.. సమాజంలో చోటుచేసుకుంటున్న అనేక హింసాత్మక ఘటనలకు మత్తు పదార్థాల వినియోగం కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వారు మానవత్వాన్ని మరచి క్రూరంగా ప్రవర్తించే ప్రమాదం ఉందన్నారు. యువత శారీరక శ్రమ, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పట్టుదల, అంకితభావంతో దేశ కీర్తిని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు.అనంతరం నాఎజుజ్రూ కార్యక్రమంలో భాగంగా ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, సమాజ అభివృద్ధిలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. యువత సమర్థమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సభాధ్యక్షత వహించిన కాఫెడ్ సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజ్ మాట్లాడుతూ.. సమాజ దిశ, దశను మార్చే శక్తి యువతకు ఉందన్నారు. యువత మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోకుండా సరైన మార్గంలో నడిపించాలనే ఉద్దేశంతో వెంకటాపురం, వాజేడు మండలాల యువకులకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడాస్ఫూర్తితో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వెంకటాపురం ICDS ప్రాజెక్టు జణ్రూా, బాల్య వివాహాల నిరోధక అధికారి. ఇందిరమ్మ మాట్లాడుతూ.. బాల్య వివాహ నిషేధ చట్టం–2006లోని ముఖ్య అంశాలను వివరించారు. బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ములుగు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ చీ. హరికృష్ణ మాట్లాడుతూ.. ాజూజూా చట్టం–2012లోని నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. మైనర్ బాలబాలికల పట్ల యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చిన్నారులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేయాలని తెలిపారు.అనంతరం నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన బ్రదర్ జయరాజ్, ఫాదర్ జోజప్ప బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాఫెడ్ సంస్థకు చెందిన వెంకటాపురం, వాజేడు మండలాల ఎన్యూమరేటర్లు, సిబ్బందితో పాటు రెండు మండలాల నుంచి 400 మందికి పైగా యువకులు పాల్గొన్నారు.





భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

పెండింగ్ క్లెయిమ్‌లు మంజూరు చేయాలని కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

50 ఏళ్లు నిండిన కార్మికులకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్

ప్రజా వాయిస్, జగిత్యాల:





భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ టీఎన్ బిల్డింగ్ ఉ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో కార్మికులు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, కార్యదర్శి ఏశమేని గణేష్ మాట్లాడుతూ.. కార్మికులకు సంబంధించిన పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.5,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, ఏఎల్ఓ కార్యాలయాల వద్ద దళారీ వ్యవస్థను నిర్మూలించాలని కోరారు. అలాగే కార్మికులకు క్యాష్‌లెస్ హాస్పిటలైజేషన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఐటీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ ఖాదర్ మొహియుద్దీన్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు సుతారి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెన్న మహేష్, ప్రధాన కార్యదర్శి ఎండీ ముక్రమ్, నాయకులు ఖాతా వినయ్, మామిడి రాజన్న, ఎండీ ఉస్మాన్, మాడిశెట్టి కిరణ్ కుమార్, అందే వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరాశ్రయులకు రగ్గుల పంపిణీ

ప్రజా వాయిస్ పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ మండలంలో నేతాజీ యువజన సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ చేశారు. పాల్వంచలోని పెద్దమ్మతల్లి దేవాలయం, సి కాలనీ గేట్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులకు నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.జె.కె. అహ్మద్, సీనియర్ వైద్యులు డాక్టర్ నామ బుచ్చయ్య చేతుల మీదుగా రగ్గులు, పండ్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ నామ బుచ్చయ్య మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అనే భావంతో నేతాజీ యువజన సంఘం ప్రతి ఏడాది చలికాలంలో అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యులు, మతిస్థిమితం లేనివారికి రగ్గులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నేతాజీ యువజన సంఘం అందిస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకుని నేటి యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యువత తమ పరిసర ప్రాంతాల్లోని అభాగ్యులకు సహాయాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు, సమగ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.డి. మంజూర్, రిటైర్డ్ సీఐ జారే బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.యు లో ప్రకృతి, వన్యజీవుల పరిరక్షణకు సంతకాల సేకరణ..

ప్రజా వాయిస్, కరీంనగర్(నవంబర్ 13):



శాతవాహన విశ్వవిద్యాలయంలో ప్రకృతి, పచ్చదనం, చెట్లు మరియు వన్యజీవుల పరిరక్షణ కోసం విద్యార్థుల ఆధ్వర్యంలో మెయిన్ గేట్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పేరుతో చెట్ల నరికివేత, అక్రమ తవ్వకాలు, మట్టి తరలింపు వంటి చర్యలను అరికట్టి జీవవైవిధ్యాన్ని కాపాడాలని కోరుతూ విద్యార్థులు, వాకర్స్ మరియు ప్రకృతి ప్రేమికుల నుంచి సంతకాలు సేకరించారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విశ్వవిద్యాలయ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. “శాతవాహన విశ్వవిద్యాలయ ప్రకృతి, వన్యజీవుల పరిరక్షణ మనందరి బాధ్యత” అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేశవ్ -- ఎస్.యు ప్రెసిడెంట్ సందీప్, ప్రవీణ్, లక్ష్మణ్, సాయి, శంకర్, ఓం ప్రకాష్, సాయి కిరణ్, శ్రీధర్, సుమన్, విద్యార్థులు పాల్గొన్నారు..

నీటి సంరక్షణే మన భవిష్యత్తుకు అసలైన భరోసా

సర్పంచ్ వేణుగోపాల్ చారి

సంగెం గ్రామంలో 50 ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఎంపీడీవో రవిచంద్ర రెడ్డితో కలిసి సర్పంచ్ పనులు ప్రారంభించిన

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)



గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించడం, వర్షపు నీటిని సంరక్షించడమే ప్రధాన లక్ష్యంగా కేశంపేట మండలం సంగెం గ్రామంలో 50 ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ జి. వేణుగోపాల్ చారి కేశంపేట మండల ఎంపీడీవో రవిచంద్ర రెడ్డితో కలిసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నీటి సంరక్షణే మన భవిష్యత్తుకు అసలైన భరోసా. గ్రామంలో నిర్మిస్తున్న ఈ 50 ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా నేరుగా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయి. దీనివల్ల రాబోయే వేసవి కాలంలో తాగునీరు సాగునీటి ఎద్దడి తగ్గుతుంది. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది గ్రామస్తులందరూ ఈ జల సంరక్షణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నారాయణ హైస్కూల్‌లో ఘనంగా ‘ఎన్‌పీఎల్’ క్రీడోత్సవాలు.. ఉత్సాహంగా తలపడ్డ విద్యార్థులు

క్రీడా పోటీల్లో తమ ప్రతిభను చాటుకున్న చిన్నారులు

విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసిన ఆదిలాబాద్ జోన్ ఏజీఎం కె. ప్రసాద్

విద్యతో పాటు క్రీడలతోనే సంపూర్ణ వికాసం సాధ్యమన్న వక్తలు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్మల్ పట్టణంలోని నారాయణ హైస్కూల్ వేదికైంది. పాఠశాల ఆవరణలో ‘నారాయణ ప్రీమియర్ లీగ్’ పేరిట క్రీడా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ క్రీడోత్సవాల్లో విద్యార్థులు వివిధ క్రీడా విభాగాలలో అత్యంత ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ జోన్ ఏజీఎశీ కె. ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు,జట్టుగా కలిసి పనిచేసే మనస్తత్వాన్ని (టీమ్ వర్క్) పెంపొందించడమే క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. హోరాహోరీగా సాగిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను ముఖ్య అతిథి కె. ప్రసాద్ మరియు పాఠశాల యాజమాన్యం అభినందించారు. విజేతలకు మెడల్స్ మరియు ప్రశంసాపత్రాలు (సర్టిఫికెట్లు) అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమేష్, ఏడీ రాజశేఖర్, ఏఓ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ సంధ్యారాణి, శ్రుతి, జెడ్‌సీఓ నరేష్, కల్యాణి, వరలక్ష్మిలతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

న్యాయ విద్యతోనే ఆదివాసీ చట్టాల అమలు సాధ్యం

GSP రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర

వెంకటాపురం ప్రజావాయిస్ :



ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు సమర్థవంతంగా అమలు కావాలంటే న్యాయ విద్య ఎంతో అవసరమని గోండ్వానా సంక్షేమ పరిషత్ (+ఘా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర అన్నారు. భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం వెంకటాపురం మండలంలోని కొమరం భీం కాలనీలో తాటి రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన గోండ్వానా సంక్షేమ పరిషత్ సమావేశంలో పూనెం సాయి దొర పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి నేటి వరకు ఆదివాసీలు చట్టాలు, న్యాయస్థానాలపై తగిన అవగాహన లేక చారిత్రక అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శతాబ్దాలుగా ఆదివాసీలు తమ భూమి, అడవి, నీటి హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని, ఆ పోరాటాల ఫలితంగా కొన్ని చట్టాలు వచ్చినప్పటికీ వాటిపై అవగాహన లేకపోవడంతో వాటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆదివాసీల భూములను గిరిజనేతరులు ఆక్రమించినప్పుడు న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే అవగాహన, సామర్థ్యం లేకపోవడం ఆందోళనకరమన్నారు. కోనేరు రంగారావు కమిషన్ నివేదిక ప్రకారం సుమారు 8 లక్షల ఎకరాల ఆదివాసీ భూమి అన్యాక్రాంతమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన న్యాయపరమైన అవగాహన ఆదివాసీ సమాజంలో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆదివాసీల రక్షణ కోసం అనేక చట్టాలు, హక్కులు కల్పించినప్పటికీ వాటి అమలులో లోపాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ఉపప్రణాళిక పేరుతో వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులు ఏజెన్సీ గ్రామాలకు పూర్తిస్థాయిలో చేరడం లేదని, వాటి వినియోగంపై ప్రశ్నించే చైతన్యం ఆదివాసీ యువతలో పెరగాలని అన్నారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వారికి న్యాయ విద్య అందుబాటులోకి రావాలని, అందుకోసం భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ కళాశాల సాధన కోసం ఆదివాసీ యువత ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో తాటి లక్ష్మయ్య, భీమయ్య, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలి

భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ‘నషా ముక్త యువ - నషా ముక్త్ భారత్ అభియాన్’ కార్యక్రమం

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్



మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత బాధ్యతగా వ్యవహరించాలని వక్తలు పిలుపునిచ్చారు. చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ‘నషా ముక్త యువ – నషా ముక్త్ భారత్ అభియాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్, సామాజిక కార్యకర్త కుమార్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ హాజరయ్యారు. బీజేవైఎం నాయకుడు మణి, అభియాన్ వాలంటీర్ రేవంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలకు సంబంధించిన చట్టాలు, శిక్షల గురించి వివరించారు. పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ నియంత్రణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ (జూూ+ఘజు) బృందాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం దెబ్బతింటాయని, తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని అన్నారు. సామాజిక కార్యకర్త కుమార్ యాదవ్ మాట్లాడుతూ డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దేశానికి యువతే ప్రధాన బలమని, యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్‌కు బానిసై ఓవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, డ్రగ్స్ నిర్మూలనలో యువత బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమ విజయానికి సహకరించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. డ్రగ్స్ రహిత యువతే.. వికసిత భారతదేశానికి పునాది

మత్తుపదార్థాల నిర్మూలనకు విస్తృత ప్రచారం నిర్వహించాలి ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించిన పాలనాధికారి రాజర్షి షా

'మత్తు రహిత భారత ఉద్యమం'లో భాగంగా రూపొందించిన అవగాహన గోడపత్రికను ఆవిష్కరించిన పాలనాధికారి

యువత, విద్యార్థులకు మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై లోతైన అవగాహన కల్పించాలని దిశానిర్దేశం

మత్తు రహిత సమాజ నిర్మాణానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశం

ప్రజా వాయిస్, /ఆదిలాబాద్



మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే తీవ్ర అనర్థాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా పిలుపునిచ్చారు. 'మత్తు రహిత భారత ఉద్యమం' (నషా ముక్త్ భారత్ అభియాన్) లో భాగంగా రూపొందించిన మత్తుపదార్థాల నివారణ ప్రచార చిత్రాన్ని శుక్రవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ... దేశ భవిష్యత్తుకు వెన్నెముక అయిన యువత చెడు వ్యసనాలకు, మత్తుపదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసలవడం వల్ల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ మహత్తర ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు పాలనాధికారి రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారిణి మాధవి, రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు మనోహర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావు, సంచాలకులు రాజు, బండారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి పోలీస్ శాఖ పెద్దపీట..

రూ.3.43 లక్షల ఆర్థిక సహాయం పంపిణీ

10 మంది హోంగార్డులకు వైద్య సహాయం

మెరిట్ స్కాలర్‌షిప్‌లు, డెత్ బెనిఫిట్స్, పదవీ విరమణ ప్రయోజనాలు

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా వాయిస్ : నల్లగొండ.



హోంగార్డుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తుందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. విధి నిర్వహణలో పోలీస్ శాఖకు వెన్నెముకగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న హోంగార్డులకు ప్రభుత్వం, పోలీస్ శాఖ అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (హోంగార్డ్స్), హైదరాబాద్ వారి ఆమోదంతో సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి నల్లగొండ జిల్లాకు చెందిన హోంగార్డులకు వివిధ సంక్షేమ ప్రయోజనాల కింద మొత్తం రూ.3,43,000 మంజూరయ్యాయి. ఈ మేరకు 10 మంది హోంగార్డులకు సంబంధించిన వైద్య సహాయం, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మరణ ప్రయోజనాలు, పదవీ విరమణ ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇద్దరు హోంగార్డులకు వైద్య చికిత్స నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రూ. 20 వేలు, ఇద్దరు హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల కింద రూ. 1,000, రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 3 వేలు అందించారు. అలాగే మరణించిన నలుగురు హోంగార్డుల కుటుంబాలకు డెత్ బెనిఫిట్ కింద ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున రూ. 60 వేలు, పదవీ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు ఒక్కొక్కరికి రూ. 1.30 లక్షల చొప్పున మొత్తం రూ. 2.60 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డులు పోలీస్ శాఖలో భాగస్వాములుగా ఉంటూ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి విధుల్లో నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి, ఆపద సమయంలో వారికి, వారి కుటుంబాలకు అండగా నిలవడం పోలీస్ శాఖ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. హోంగార్డులు తమ విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కళ్యాణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి బాల్ రెడ్డి



ప్రజా వాయిస్.. వీపనగండ్ల

ఈనెల 15 నుండి 18 వరకు నలగొండ పట్టణంలో జరిగే అఖిల భారత జాతీయ రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ వీపనగండ్ల మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూలి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల కోసం రసాయనక ఎరువులు పురుగు మందులు విత్తనాల ధరలను అధిక మొత్తంలో పెంచి రైతుల వెన్ను విరుస్తున్నదని గత దశాబ్ద కాలంగా రైతులకు గిట్టుబాటు ధర అందిస్తామని అధికారంలోకి వచ్చి రైతులను మోసగిస్తూన్నదని, గతంలో మూడు చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా దొడ్డి దారిన మళ్లీ చట్టాలను అమలుపరిచేందుకు ప్రయత్నిస్తున్నదని కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు రైతులు సన్నద్ధం కావాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఈ మహాసభలకు రైతు ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమ్ములు పరిచేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా కరువు మండలాలను ప్రకటించి చోద్యం చూస్తున్నదని ఖరీఫ్ లో వేసి ఎండిపోయిన పంటలకు వాతావరణం సహకరించక రబీలో విత్తనం వేయని పంట పొలాలకు వాణిజ్య పంటలకు ఎకరాకు 50వేల రూపాయలు సాధారణ పంటలకు 30 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సంవత్సరం తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దుచేసి నూతనంగా వ్యవసాయ రుణాలను రైతులకు అందించాలని రైతు భరోసా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని గత మూడు నెలల నుండి రాష్ట్రంలో వేలాది మంది రైతులు మరణించిన వారికి ఐదు లక్షల బీమా పథకాన్ని వర్తింపజేయాలని,, నీటి లభ్యత ప్రాంతాలను గుర్తించి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ప్రవేశపెట్టి రైతులకు సాగునీరు అందించాలని, ఆయన అన్నారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఇంద్రమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తామని అనడం సరైంది కాదని గుంట భూమి ఉన్న ప్రతి రైతుకు ఇందిరమ్మ బీమా పథకాన్ని వర్తింపజేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డు లిస్టు రైతు బందు పథకాన్ని వారికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు ఇంటికొక మనిషి,ఊరికి ఒక బండి,నల్లగొండ రండి నినాదంతో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోరైతు సంఘం జిల్లా కమిటీ నక్క ఈశ్వర్, సిఐటియు నాయకులు ఆశన్న, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు బాలస్వామి, మత్స్యశాఖ నాయకులు వెంకట్ స్వామి, సాయిబాబా, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్ గౌడ్, టప్ప నరసింహ, ఎర్ర వెంకటయ్య, కురువ ఉషన్, వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్ కాలనీలో 5 లక్షల లీటర్ల సామర్థ్యంతో జీఎల్ఎస్ఆర్ నిర్మాణానికి స్థల పరిశీలన

జిన్నారం ప్రజావాయిస్



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రామ్‌నగర్ కాలనీలో సుమారు 5 లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్ (జీఎల్ఎస్ఆర్) నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశం, చైర్మన్ చిన్నపావని కుమార్ గౌడ్ కలిసి స్థల అనుకూలతను పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ట్యాంకు అందుబాటులోకి వస్తే నీటిని నిల్వ చేసి, అక్కడి నుంచి గుమ్మడిదల గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నీటి నిల్వ ట్యాంకులకు సరఫరా చేసే విధంగా ప్రణాళిక రూపొందించనున్నారు. తద్వారా గ్రామంలోని అన్ని ప్రాంతాలకు సమస్యయంతో నీటిని పంపిణీ చేయడంతో పాటు, వేసవిలోనూ నీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడానికి అవకాశం ఉంటుంది. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా ఈ ఏర్పాట్లు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, అధికారులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలలే భావి సమాజ నిర్మాతలు..

వారి ప్రతిభను ప్రోత్సహించాలి

ఐపీఎస్‌లో సందడిగా బాలల దినోత్సవ వేడుకలు

ఆటపాటలు, రంగవల్లులతో అలరించిన విద్యార్థులు

చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ



ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ పేర్కొన్నారు.సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్న కాలనీలో గల ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ.. బాల్యం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో విలువైన దశ అని, ఈ సమయంలోనే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు, వివిధ వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగురంగుల ముగ్గులతో తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించగా, చిన్నారుల కేరింతలు, సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు వైభవంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్‌తో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా జెన్నారెడ్డి పద్మ ఎన్నిక

ఎమ్మెల్యే కోరం కనకయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షురాలు

శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

హాజరైన జిల్లా, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు

ప్రజా వాయిస్, బయ్యారం..

మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా జెన్నారెడ్డి పద్మ నూతనంగా ఎన్నికైన సందర్భంగా జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో నూతన జిల్లా అధ్యక్షురాలు జెన్నారెడ్డి పద్మ బయ్యారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జెన్నారెడ్డి పద్మను శాలువాతో ఘనంగా సత్కరించి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలియజేశారు. నూతన బాధ్యతలను స్వీకరించిన ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సందర్భంగా అభినందనలు వ్యక్తం చేశారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా జెన్నారెడ్డి పద్మ ఎన్నిక కావడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, ప్రజలకు సంబంధించిన అంశాల్లో నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, బయ్యారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బిజ్జా వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

ప్రతి వర్షపు చుక్క భూమిలోకి..
భూగర్భ జలాల పెంపునకు మధురనగర్‌లో ప్రత్యేక కార్యాచరణ

నేరడిగొండ ఏడవ వార్డు మధురనగర్‌లో ఇంటింటికీ తిరిగి ఇంకుడు గుంతల ఆవశ్యకతపై విస్తృత అవగాహన.

ప్రతి ఇంటికీ వ్యక్తిగత ఇంకుడు గుంతలతో పాటు మురుగునీరు నిలిచే చోట సామూహిక గుంతల ఏర్పాటుకు చొరవ

నీటిని కాపాడితేనే భవిష్యత్తును రక్షించుకోగలమని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ పిలుపు

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం

వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించాలనే ఉన్నత లక్ష్యంతో నేరడిగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడవ వార్డు మధురనగర్ బస్తీలో శుక్రవారం ప్రత్యేక జల సంరక్షణ కార్యక్రమం చేపట్టారు. సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్, నేరడిగొండ ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్, పంచాయతీ కారోబారి పోశెట్టి కలిసి బస్తీలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ఇంకుడు గుంతల అవసరాన్ని విపులంగా వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసేందుకు ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు మంజూరు చేయించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ మాట్లాడుతూ... ప్రస్తుతం భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వర్షపు నీరు కాలువల ద్వారా వృథాగా బయటకు వెళ్లిపోకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి చేరేలా చేయడం వల్ల భూగర్భ జలమట్టం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల బోర్లు, బావుల్లో నీటి నిల్వలు మెరుగుపడటంతో పాటు భవిష్యత్తులో తాగునీటి ఎద్దడిని నివారించవచ్చని పేర్కొన్నారు. ఇంకుడు గుంతలు కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, రాబోయే తరాలకు నీటిని అందించే విలువైన సంపద అని అభివర్ణించారు. అలాగే



మురుగునీరు నిలిచి ఉన్న ప్రదేశాలలో గ్రామ పంచాయతీ ద్వారా సామూహిక ఇంకుడు గుంతలను మంజూరు చేయించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటా ఇంకుడు గుంత, ప్రతి గ్రామంలో జలసంరక్షణ అనే నినాదంతో ప్రజలందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు షాకీర్, సాప్, యూనుస్, జియాఉల్లా, నయీమ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడా నైపుణ్యాలకు ప్రోత్సాహం
బోథ్ మిత్ర బృందంలో క్రికెట్ సాధన వలయం ప్రారంభం

మండల కేంద్రంలోని మిత్ర బృందం ఆవరణలో నూతనంగా క్రికెట్ సాధన వలయాన్ని ప్రారంభించిన అధ్యక్షుడు వైద్య సురేష్

స్థానిక యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ ప్రత్యేక సాధన వేదిక ఎంతగానో దోహదపడుతుందని వెల్లడి

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తాయని యువతకు సూచన

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం

బోథ్ మండల కేంద్రంలోని మిత్ర బృందం ఆధ్వర్యంలో స్థానిక యువత కోసం నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ సాధన వలయాన్ని బృందం అధ్యక్షుడు వైద్య సురేష్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు మెరుగైన సాధన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక వలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సురేష్ స్వయంగా బ్యాట్ పట్టి బంతిని ఆడి క్రీడా సాధనను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... నేటి యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను బయటకు తీసుకురావడానికి ఇలాంటి సాధన వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిరంతరం క్రీడల్లో పాల్గొనడం వల్ల యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండటమే కాకుండా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా



ఎదుగుతారని సూచించారు. ఈ అవకాశాన్ని బోథ్ ప్రాంత యువత సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోథ్ గ్రామ పెద్దలు, మిత్ర బృందం సభ్యులు మరియు స్థానిక యువకులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో జల సంరక్షణ పనులకు శ్రీకారం



ప్రజావాయిస్/తాండూరు:

పెద్దేముల్ గ్రామపంచాయతీ, తండాలో చేపట్టనున్న జల సంరక్షణ పనులను ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ రతన్ సింగ్, ఎంపీడీఓ తిరుమలస్వామి శుక్రవారం పరిశీలించారు. బోర్‌వెల్ రీచార్జ్, మ్యాజిక్ సోక్‌పిట్, కమ్యూనిటీ సోక్‌పిట్ పనులకు స్థలాలను పరిశీలించి మార్క్‌అవుట్ ఇచ్చారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించి నీటి వనరులను పెంపొందించేలా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలోని స్వయం సహాయక సంఘం భవనం, భవిత భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డీవై చిన్న నర్సింలు, ఉపసర్పంచ్ డీవై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం మండలంలో 442 కుటుంబాలకు చేయూత..నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ!

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ప్రజా వాయిస్ / బొమ్మలరామారం:

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బొమ్మలరామారం మండల కేంద్రంలోని ఓం శివ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య హాజరై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 442 మంది నూతన పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సమాజంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నెలా అందే పెన్షన్‌తో పేద కుటుంబాలకు నిత్యావసర ఖర్చుల విషయంలో ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ సింగిర్తి మల్లేశం, యాదాద్రి భువనగిరి జిల్లా డీఆర్డీఓ నాగిరెడ్డి, ఎంపీడీఓ శ్యామల, తహసీల్దార్ రాధ, ఎంపీఓ శశికళ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర సత్యనారాయణ, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్ , రంగాపూర్ సర్పంచ్ యంజల సరస్వతి గణేష్, బొమ్మలరామారం సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్, సూర్యప్రకాష్ రెడ్డి, సుంచు యాదగిరి , మైలారం సుదర్శన్, కూకుట్ల ఈశ్వర్ యాదవ్, జంగారెడ్డి, మన్నెం నరేందర్ రెడ్డి, మర్రి భగవంత రెడ్డి, ఆగం రెడ్డి, హేమంత్ రెడ్డి, శ్రీకాంత్ , కస్తుల నాగరాజ్ ,వివిధ గ్రామాల సర్పంచులు, పిఏసిఎస్ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి పోటీలు

విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య విలువలపై ఎన్నికల ప్రక్రియ అవగాహన

భవిష్యత్తులో చైతన్యవంతమైన, బాధ్యతాయుతమైన ఓటర్లుగా విద్యార్థులు ఎదగాలి

మండల విద్యాశాఖ అధికారి గుమ్మడి లక్ష్మినారాయణ



ప్రజా వాయిస్ కొత్తగూడ

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు కొత్తగూడ మండలస్థాయిలో వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను మండలంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు స్థానిక ఎంపీయూపీఎస్ కొత్తగూడ పాఠశాలలో నిర్వహించారు.వక్తృత్వ పోటీల్లో కేజీబీవీ పోలారం పాఠశాలకు చెందిన ఎం. అక్షయ ప్రథమ బహుమతి సాధించగా, టీజీడబ్ల్యూఆర్ మోడల్ స్కూల్, కొత్తగూడకు చెందిన ఎస్. శ్రీకాంత్ ద్వితీయ బహుమతి సాధించారు.క్విజ్ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ పోగుళ్లపల్లికి చెందిన హెచ్. ప్రభాస్, కె. జయశంకర్ బృందం ప్రథమ బహుమతి సాధించగా, జెడ్పీహెచ్ఎస్ ఎదుళ్లపల్లికి చెందిన ఎ. హేమంత్, ఎ. క్రీస్తు బృందం ద్వితీయ బహుమతి సాధించారు.మండలస్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు త్వరలో నిర్వహించనున్న ములుగు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి జి. లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. కార్యక్రమ నిర్వహణలో జి. వేణు, టి. రమేష్, ఎ. కోటేశ్వరరావు, జె. జుమ్యాలాల్, కవిత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా... తహసీల్దార్ రాజు, మండల విద్యాశాఖాధికారి విజేతలను అభినందిస్తూ, విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ చైతన్యవంతమైన, బాధ్యతాయుతమైన ఓటర్లుగా ఎదిగి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

మీ భద్రతే మా ప్రథమ బాధ్యత

షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం

కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు

సైబర్ నేరాలు పోక్సో చట్టం బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు



(ప్రజా వాయిస్ షాద్‌నగర్)

నేటి యువత విద్యార్థులు చట్టాలను కేవలం పాఠ్యాంశాలుగానే కాకుండా తమ ఆత్మరక్షణకు ఆయుధాలుగా మలుచుకోవాలని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, షాద్‌నగర్ డీసీపీ, ఏసీపీల మార్గదర్శకత్వంలో రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..స్మార్ట్‌ఫోన్లు సోషల్ మీడియా వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని అపరిచితులతో పరిచయాలు, నకిలీ ఖాతాలు, సైబర్ బుల్లింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత ఫోటోలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.మరియు పోక్సో చట్టం పిల్లలకు కల్పిస్తున్న రక్షణ కవచాన్ని వివరిస్తూగుడ్ టచ్ – బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయంతో దాచుకోకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ధైర్యం చెప్పారు.బాల్య వివాహాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయని, చట్టరీత్యా ఇది తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. ఎక్కడైనా బాల్య వివాహ ప్రయత్నాలు జరిగితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని చట్టవ్యతిరేక కార్యకలాపాలను గమనించినా లేదా ఆపదలో ఉన్నా ఏమాత్రం సంకోచించకుండా పోలీసుల సహాయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు...

నెలరోజులైనా గింజ కూడా కొనని వైన్యం

200 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

50 కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు

నెలరోజుల కల్లాల వద్ద కాపులు కాస్తున్న రైతులు

అత్యధికంగా సంగారెడ్డిలోని 1. 65 లక్షల విస్తీర్ణంలో వరి పంట సాగు

ఇది అదునుగా రైతుల వద్దకు దళారులు



ప్రజా వాయిస్ సంగారెడ్డి :

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 200 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు వరి కోతలు ప్రారంభమై 45 రోజులు కావస్తున్న కనీసం 100 కేంద్రాల్లో కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. ఇప్పటివరకు అధికారులు తెలిపిన నివేదిక ప్రకారం కేవలం 28,500 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు అధికారులు నివేదిక అందజేశారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 50 కేంద్ర కొనుగోలు కేంద్రాలలో మాత్రమే కొనుగోలు ప్రారంభం అయింది. మిగతా ప్రాంతాలలో చూస్తే ఎక్కడి దాన్ని అక్కడే కళ్ళల్లో దర్శనమిస్తుంది. అటు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోలేక ఇటు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కల్లాల వద్దని రైతులు రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారు. ఇప్పటికే లెనిన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతుంటే ప్రభుత్వం మాత్రం మరోవైపు సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో మరింత నష్టపోవాల్సి వస్తుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో 1,67,000 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 50 శాతం కోతలు పూర్తి కావస్తున్నాయి. కానీ ఆ స్థాయిలో ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేం లేక పక్క రాష్ట్రాల్లో నుంచి వచ్చిన ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు. మండలానికి రెండు కొనుగోలు కేంద్రాల్లోనే సన్న వడ్లు కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దాదాపు జిల్లాలో సన్న వడ్ల కంటే అత్యధిక విస్తీర్ణంలో ఇతర దొడ్డు రకం వడ్లను సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నగాళ్లకు బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడంతో కొందరు రైతులు ఆసక్తి చూపి వ్యవసాయ బోర్ల వద్ద సన్నగుడ్లు వేసినప్పటికీ మరికొన్ని ప్రాంతాలలో అయితే వెయ్యి పది, ఇతర దొడ్డు రకం వడ్లను మాత్రమే పండించారు. కానీ వాటిని ఇంతవరకు కూడా కొనుగోలు చేయకపోవడంతో ఒడ్లు పూర్తిగా ఎండి బరువు తగ్గే అవకాశం ఉందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు ఇప్పటివరకు 283 క్వింటాళ్లు మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అది కూడా క్షేత్రస్థాయిలో అంత మోతాదులో కొనుగోలు చేసినట్లు ఎక్కడ కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో మాత్రం పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమని రాసి ఉంటాయి కానీ కొనేవారు లేకపోవడంతో రైతులు దివాలా తీస్తున్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

పాలకుర్తిలో ఘనంగా ప్రశాంత్ - సింధుజ వివాహ వేడుక

వేడుకకు హాజరై అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్

వైవాహిక జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్ష.. పాల్గొన్న బీఆర్ఎస్ ముఖ్య నేతలు

ప్రజా వాయిస్ /పాలకుర్తి/రాయపర్తి,

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోతర్ల సమ్మయ్య కుమారుడు ప్రశాంత్ వివాహం సింధుజతో పాలకుర్తి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులు ప్రశాంత్ – సింధుజ లకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నిండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం వరుడి తండ్రి పోతర్ల సమ్మయ్య కుటుంబ సభ్యులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో రాయపర్తి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను దీవించారు.



బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ప్రజా వాయిస్ దంతాలపల్లి నవంబర్13

దంతాలపల్లి మండలంలోని పెద్ద ముప్పారం జడ్.పి.హెచ్.ఎస్ కలాన్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ,సింధు ప్రియా, డి ఈ ఓ గా, ప్రధానోపాధ్యాయులుగా మేఘన, వ్యవహరించడం జరిగింది. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా, సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ,మాట్లాడుతూ బాలల దినోత్సవం గొప్పతనము మరియు స్వయం పరిపాలన దినోత్సవం గొప్పతనాన్ని వివరించారు. స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య, చారి, అర్పిత, ఉపాధ్యాయ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు .



అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న చర్చిల పైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కి వినతి పత్రం

నల్గొండ జిల్లా బి జె వై ఎం ఉపాధ్యక్షులు నెల్లికంటి గోపి

ప్రజా వాయిస్ కొండమల్లపల్లి మండలం నవంబర్ 13

కొండమల్లపల్లి మండలం కొలుముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 144లో సంబంధిత అనుమతులు లేకుండా చేపడుతున్న చర్చి నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చర్చిలపైన తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో కు వినతిపత్రం అందజేసిన నల్లగొండ జిల్లా బి జె వై ఎం ఉపాధ్యక్షులు నెల్లికంటి గోపి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న చర్చిలపైన ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఇప్పటికైనా తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి అక్రమ చర్చిలపైన చర్యలు తీసుకోవాలని నెల్లికంటి గోపి ఎంపీడీవోని కోరారు



జాతీయ పోటీలకు యాలాల విద్యార్థినుల ఎంపిక

ప్రజావాయిస్/యాలాల్:
యాలాల పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. హనుమకొండలో జరిగిన పోటీల్లో డిస్కస్ త్రో విభాగంలో మూడవత్ సుస్మిత ప్రథమ, రాథోడ్ సాక్షి ద్వితీయ స్థానాలు సాధించారు.ఈ సందర్భంగా బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులను ఘనంగా సన్మానించారు. వారి విజయానికి కృషి చేసిన పీఈటీ రాజు, ప్రధానోపాధ్యాయులు గాజుల సిద్ధరామేశ్వర్లను కూడా అభినందించారు. విద్యార్థినులకు భవిష్యత్తులో అవసరమైన సహకారం అందిస్తామని రాజ్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల నియోజకవర్గానికి కొత్తగా 3,179 'చేయూత' పెన్షన్లు మంజూరు

విషయం వెల్లడించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

మండలాల వారీగా విడుదలైన దివ్యాంగులు, ఒంటరి మహిళ, గీత, నేత మరియు వితంతు పెన్షన్ల వివరాలు

త్వరలో లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరు పత్రాలు అందజేత

ప్రజా వాయిస్, కోరుట్ల:



కోరుట్ల నియోజకవర్గానికి కొత్తగా 3,179 'చేయూత' పెన్షన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఆయన మండల వారీగా మంజూరైన పెన్షన్ల వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణం, దివ్యాంగులు - 131, ఒంటరి మహిళలు - 132, గీత కార్మికులు - 23, వితంతువులు - 350 (మొత్తం: 636), కోరుట్ల మండలం, దివ్యాంగులు - 75, గీత కార్మికులు - 161, వితంతువులు - 207 (మొత్తం: 527), మెట్‌పల్లి మున్సిపాలిటీ, వికలాంగులు - 103, ఒంటరి మహిళలు - 76, గీత కార్మికులు - 62, నేత కార్మికులు - 2, వితంతువులు - 292 (మొత్తం: 535), మెట్‌పల్లి మండలం, వికలాంగులు - 79, ఒంటరి మహిళలు - 58, గీత కార్మికులు - 137, వితంతువులు - 209 (మొత్తం: 485), ఇబ్రహీంపట్నం మండలం, వికలాంగులు - 56, ఒంటరి మహిళలు - 56, గీత కార్మికులు - 35, వితంతువులు - 164 (మొత్తం: 311), మల్లాపూర్ మండలం, వికలాంగులు - 85, ఒంటరి మహిళలు - 100, గీత కార్మికులు - 123, నేత కార్మికులు - 5, వితంతువులు - 374 (మొత్తం: 687), ఇవన్నీ కలుపుకొని నియోజకవర్గంలో మొత్తం 3,179 పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరు పత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు.



వేషధారణలతో అలరించిన చిన్నారులు.. ఘనంగా బాలల దినోత్సవం

నెహ్రూ నుంచి సైనికుడి వరకు విభిన్న రూపాల్లో విద్యార్థుల సందడి

ప్రజా వాయిస్, చిలుకూరు:
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతుల గూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు జవహర్‌లాల్ నెహ్రూ, శాస్త్రవేత్త, పోలీసు, సైనికుడు, వైద్యుడు, రైతు తదితర వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థుల విభిన్న వేషధారణలు, సందడి కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, వారికి నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తిని చిన్నతనం నుంచే అలవర్చాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, గోపిరెడ్డి, సురేష్, మమత, శైలజ, అస్మా, గ్రామ పెద్దలు ఉద్దండు నారాయణ, రామిశెట్టి కోటయ్య, నాగుల్ పాషా, మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





అభివృద్ధి సంక్షేమ కార్యక్రమం

ఎమ్మెల్యే కాలే యాదయ్య జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డితో రూ.10 లక్షల హెచ్ఎండీపీ నిధులతో నిర్మించిన రోడ్డు ప్రారంభం.. సర్వసభ్య సమావేశం.. నూతన చేయూత పెన్షన్ల పంపిణీ

(ప్రజా వాయిస్ షాబాద్)
షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

14వ వార్డులో రూ.10 లక్షలతో రోడ్డు ప్రారంభం
షాబాద్ మండల కేంద్రంలోని 14వ వార్డులో హెచ్ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మండల అభివృద్ధిపై సమీక్ష
అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమీక్ష, సామర్థ్య వృద్ధి శిక్షణ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నూతన చేయూత పెన్షన్ల పంపిణీ:
షాబాద్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో నిర్వహించిన నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడంతో పాటు చేనేత కార్మికులు, పేద వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్ జి. వెంకట నారాయణ, ఎంపీడీవో అపర్ణ, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



చాడలో న్యాయ విజ్ఞాన సదస్సు

చట్టాలపై అవగాహన అవసరం

ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి: న్యాయవాది ఎస్. సాయి శ్రీనివాస్

మోటకొండూరు, నవంబరు 13(ప్రజా వాయిస్):-
యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు మరియు కార్యదర్శి సూచనల మేరకు జాతీయ న్యాయ సేవల వారం రోజుల కార్యక్రమంలో భాగంగా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయ న్యాయవాది ఎస్. సాయి శ్రీనివాస్ పాల్గొని గ్రామ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులతో పాటు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిషేధమని, పిల్లలను ముఖ్యంగా ఆడపిల్లలను బాగా చదివించాలని, వారిని పనికి వినియోగించడం లేదా చిన్నతనంలో వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు. అలాగే పిల్లలు అధికంగా మొబైల్ ఫోన్లు వినియోగిస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలని, లేదా 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్ భూమయ్య, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టప్రకారంగా నడుచుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ ఎం.డి. మౌలానా పాల్గొని గ్రామస్తులకు లీగల్ లిటరసీ కరపత్రాలను అందజేశారు.



పుట్టల వద్ద పోటెత్తిన భక్తులు.. నాగదేవతకు ప్రత్యేక పూజలు

చిలుకూరు మండలవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

ప్రజా వాయిస్, చిలుకూరు:
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలవ్యాప్తంగా శుక్రవారం నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు పెద్ద సంఖ్యలో పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలకు పసుపు, కుంకుమలు సమర్పించి, పాలు పోసి, గుడ్లు ఉంచి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు.కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నాగదేవతను ప్రార్థిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకల్లో మహిళలతో పాటు అయ్యప్ప స్వాములు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ ముక్కాముల శ్రీకాంత్ యాదవ్

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ముక్కాముల శ్రీకాంత్ యాదవ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని డి. రేపాకలో మహిళ సంఘబంధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, ఉపసర్పంచ్ బొనుగు లింగారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు సూరారం నవీన్, హరీష్ సీసీలు యాదయ్య, ప్రసాద్ మహిళా సంఘం అధ్యక్షురాలు సూరారం స్వాతి, విబీకే హఫీజ, కాంగ్రెస్ నాయకులు బాలెంల సురేష్, మహిళ సంఘం సభ్యులు చౌడమ్మ, జయమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



15 న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

పర్యటనను విజయవంతం చేయండి

ప్రజా వాయిస్,కొత్త గూడ
స్థానిక కొత్తగూడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సెంట్రల్ ఫిలిం బోర్డు సభ్యులు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ మరియు రాష్ట్ర నాయకులు చెల్వూరి వెంకన్నలు హాజరై మాట్లాడుతూ కొత్తగూడ - గంగారం మండల ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పొడు భూముల సమస్యలు సత్వర పరిష్కారం కొరకు 15న కొత్తగూడ మండల కేంద్రానికి హాజరవుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ కీ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు అదేవిధంగా ఎవరికైతే సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారో వారిపై ఫిర్యాదు చేయవచ్చు అని కూడా తెలిపారు అదేవిధంగా ముఖ్యంగా ఆర్ ఎఫ్ ఆర్ పట్టాలపై బ్యాంకు లోన్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న బ్యాంక్ అధికారులపై మరియు ఫారెస్ట్ అధికారులపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకొస్తే సత్వర పరిష్కారానికి వారు కృషి చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడ బిజెపి మండల అధ్యక్షుడు యాదగిరి మురళి, తోటకూర మధు, నవీన్ నాయక్, స్వామి నాయక్, దండు ప్రవీణ్, తుపాకుల పరశు రాములు, హరిలాల్, నోముల సాంబరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు



అనంతగిరికి కొత్తగా 491 పింఛన్లు.!

నాలుగు వర్గాలకు చేయూత.. లబ్ధిదారుల్లో హర్షం

మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు

ప్రజా వాయిస్, అనంతగిరి:
అర్హులైన పేదలకు సంక్షేమ భరోసా కల్పించే దిశగా సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలానికి ప్రభుత్వం కొత్తగా 491 చేయూత పింఛన్లు మంజూరు చేసింది. మండలంలోని నాలుగు వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు కావడంపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, లబ్ధిదారుల తరఫున ముసుకు శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలకు మండల ప్రజలు అండగా ఉంటారని ఆయన తెలిపారు.

వర్గాల వారీగా పింఛన్లు ఇలా..

వితంతువులు	273
దివ్యాంగులు	104
ఒంటరి మహిళలు	72
గీత కార్మికులు	42
మొత్తం	491